IN MEDIA PUBLICATION PVT LTD
MV NEWS
మన మీ వార్త

@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512

గురువారం
15 అక్టోబర్ 2026
సూర్యపేట, హైదరాబాద్
MANA MI VARTA NEWS

# మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

సంపుటి : 02
సంచిక :104
పేజీలు : 12 వెల : 5/-



వార్త
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
91-8522888459 9515342857



PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE


# కోవిడ్ లాంటి విపత్తు



- కరెంట్ పోతే ఐఏఎస్‌ల సస్పెన్షన్
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం
- పంటలకు వచ్చే 20 రోజులు అత్యంత కీలకం
- విద్యుత్ సరఫరాలో అంతరాయాలను సహించేది లేదు
- వచ్చే జూన్ వరకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్
- తాగునీరు, పశుగ్రాసానికి కొరత రావద్దు
- ప్రతి మండలానికి గ్రూప్--1, 2 అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ..

**హైదరాబాద్:**
వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతుల పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు విద్యుత్ సరఫరా చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పంటలు చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ కొరత కారణంగా రైతులు పంట నష్టపోకూడదని హెచ్చరించారు. వ్యవసాయానికి విద్యుత్ అవసరం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అందుకు అను గుణంగా సరఫరా పెంచాలని సూచించారు. వర్షాభావ పరిస్థి తులు, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరాపై బుధ వారం రేవంత్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. జిల్లాల వారీగా పరిస్థితులను అధికారులు సీఎంకు వివరిం చారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సాఫీగా జరిగేలా చూడాలని పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు ఎందుకు రావడం లేదని నిలదీశారు. రాబోయే రోజుల్లో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు లింకేజీ - మిగతా 11లో



### సౌదీలో దాడులు
## వెంటనే ఆపాలి

- ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు'
- భారతీయులకు కేంద్రం అడ్వైజరీ
- హూతీ తిరుగుబాటు దారులు సౌదీలోని పౌర మౌలిక సదుపాయాలపై చేస్తున్న దాడుల్ని భారత్ ఖండించింది
- అక్కడి భారతీయులకు ఎంఈఏ కీలక మార్గదర్శకాలు జారీ



### చైనాతో సంబంధాలు సాధారణ స్థితికి రావాలంటే వాస్తవాధీన రేఖ స్థిరంగా ఉండాలి

- సరిహద్దుల్లో ఎటువంటి అశాంతి చెలరేగినా దానికి పర్యవసానాలు ఉంటాయి
- విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం
- రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణ సరిహద్దు వద్ద శాంతితోనే ముడిపడి ఉన్నాయి

## జంతర్‌మంతర్ భారత ప్రజలది

- సీజేపీ నేతల కస్టడీపై విపక్షాలు ఫైర్
- సీజేపీ కార్యకర్తల జైలుకు పంపడంపై విపక్షాలు ఆగ్రహం
- యువతను జైలుకు పంపడం పిరికిపంద చర్యగా అభివర్ణించాయి.





## ఉద్యోగులుగానే మిగలొద్దు.. సొంత సంస్థలు స్థాపించాలి

- పెద్ద కంపెనీలకు సేవలందించే వారిగానే యువత మిగిలిపోకూడదు
- సరికొత్త వ్యాపార ఆలోచనలతో స్టార్టప్స్‌ను స్థాపించాలి
- స్కైరూట్ వంటి కంపెనీలు 10 రావాలి
- సమాఖ్య బిజినెస్ సమ్మిట్-- 2026లో సీఎం రేవంత్‌రెడ్డి



## ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన..

- కొత్త ఆందోళనకు అభిజీత్ దీప్కే పిలుపు..
- సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో కార్యక్రమం
- నిరసనకు 'లెహ్రా దో తిరంగా' పేరు..
- సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాల అరెస్టుకు నిరసనగా కార్యక్రమం
- అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల
- స్థానికంగా తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే పిలుపు

## ఏడో బ్లాక్ తొలగించాల్సిందే!



- మేడిగడ్డ బరాజ్‌పై సాంకేతిక పర్యవేక్షణ కమిటీ స్పష్టీకరణ
- ఢిల్లీలో కాళేశ్వరం బరాజ్‌ల పునరుద్ధరణ పనుల ప్రాథమిక డిజైన్లపై చర్చ
- పలు మార్పులు సూచించిన కమిటీ
- బరాజ్‌లకు ఎగువ, దిగువన డయాఫ్రమ్ వాల్స్ ఏర్పాటు
- దిగువన కొత్త స్టిల్లింగ్ బేసిన్లు, కొత్త కటాఫ్ వాల్స్



### దేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోంది

- అక్టోబర్ 14 నుంచి 16 వరకు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న 'బృహత్తర భారత్
- ప్రపంచవ్యాప్తంగా భారతదేశ సాంస్కృతిక సంబంధాలపై అంతర్జాతీయ సదస్సు'ను ఉద్దేశించి పంపిన సందేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

### రాష్ట్రంలో పెట్టుబడులు
# సురక్షితం

- యూకే మేయర్ల బృందంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రానున్న రోజుల్లో తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి
- డిసెంబర్ 7--9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
- బ్రిటన్ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు సీఎం ఆహ్వానం



**హైదరాబాద్**
తెలంగాణలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు విధానపరమైన కొనసాగింపు ఉంటుందని, పెట్టుబ డులు సురక్షితంగా ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి బ్రిటన్ ప్రతినిధి బృందానికి భరోసా ఇచ్చారు. నైపుణ్యం కలి గిన మానవ వనరులు, అనుకూల వ్యాపార వాతా వరణం తెలంగాణకు బలమని చెప్పారు. ప్రపంచంలోని ఇతర రాష్ట్రాలతో తెలంగాణ పోటీపడుతోందని, రానున్న కొన్నే ళ్లలో తయారీ రంగం అభివృద్ధికి అత్యధిక - మిగతా 11లో

# సంపాదకీయం

## భారత్‌లో స్టార్‌లింక్ వివాదం

భారత్‌లో స్టార్‌లింక్ ఎంట్రీపై ఎలాన్ మస్క్ వ్యాఖ్యల కలకలం రేపుతున్నాయి. అంబానీపై విమర్శలు స్పెక్ట్రమ్ కేటాయింపులు, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి స్పందనలతో వివాదం ప్రారంభమయింది. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్, భారత పారిశ్రామిక దిగ్గజం ముఖేష్ అంబానీల మధ్య నడుస్తున్న వాణిజ్య పోరు సరికొత్త రాజకీయ, సామాజిక రచ్చకు దారితీసింది. భారత ప్రజలపై తమ ఏకఛత్రాధిపత్యాన్ని కాపాడుకోవడానికి కొందరు ఒలిగార్క్‌లు స్టార్‌లింక్‌ను అడ్డుకుంటున్నారు.. భారత్‌కు నిజమైన బాస్ అంబానీయేనా? అంటూ ఎలాన్ మస్క్ ఎక్స్ వేదికగా విరుచుకుపడటంతో ఈ అంశం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయితే, ఈ ఆరోపణలు కేవలం ఒక వ్యాపార పోటీకి ప్రతిరూపమా లేక దేశీయ నియంత్రణలు, భద్రతా ప్రమాణాలకు సంబంధించిన అంశమా అన్నది లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. స్టార్‌లింక్ అనేది ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ రూపొందించిన లో–ఎర్త్ ఆర్బిట్ ఉపగ్రహ నెట్‌వర్క్. సాంప్రదాయ ఫైబర్ లేదా సెల్ టవర్ల అవసరం లేకుండా, అంతరిక్షంలో ఉన్న వేలాది చిన్న ఉపగ్రహాల ద్వారా నేరుగా భూమిపై ఉన్న డిష్, రిసీవర్లకు హై–స్పీడ్ శాటిలైట్ ఇంటర్నెట్‌ను ఇది అందిస్తుంది. భౌగోళికంగా చేరుకోలేని కొండ ప్రాంతాలు, అడవులు , మారుమూల గ్రామాలకు ఇది ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పిస్తుంది. భారత్‌లో ప్రవేశించేందుకు స్టార్‌లింక్ గత ఐదేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, వ్యాపార నిబంధనలు , స్పెక్ట్రమ్ కేటాయింపు పద్ధతులపై దేశీయ టెలికాం కంపెనీలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌తో ప్రధాన విభేదాలు తలెత్తాయి. అసలు వివాదానికి ప్రధాన మూలం స్పెక్ట్రమ్ కేటాయింపు విధానం . అంతర్జాతీయ నిబంధనల ప్రకారం శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను వేలం వేయకుండా పరిపాలనా ప్రాతిపదికన కేటాయించాలని మస్క్ వాదిస్తుండగా, దేశీయ స్పెక్ట్రమ్‌ను వేలం ద్వారా మాత్రమే కేటాయించాలని, అప్పుడే లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ ఉంటుందని అంబానీ నేతృత్వంలోని జియో పట్టుబట్టింది. దీనికితోడు జాతీయ భద్రత, డేటా లోకలైజేషన్ అంశాలు ప్రధాన అవరోధాలుగా మారాయి. భారతీయుల డేటా దేశీయ సర్వర్లలోనే భద్రంగా ఉండాలని, భద్రతా ఏజెన్సీలు నిఘా పెట్టేలా శాటిలైట్ గేట్‌వేలను ఏర్పాటు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. మస్క్ ఆరోపణలను కేంద్ర నివేదికలు తీవ్రంగా ఖండించాయి. టెలికాం నియంత్రణలన్నీ పారదర్శకంగా, వివక్ష రహితంగా ఉన్నాయని, స్టార్‌లింక్‌తో పాటు ఇతర మూడు సంస్థలు కూడా ఒకే భద్రతా తనిఖీల దశలో ఉన్నాయని కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ వ్యాపార పోరు కాస్త రాజకీయ రంగు పులుముకుంది. మస్క్ వ్యాఖ్యలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. వెల్‌కమ్ టూ ఇండియా ఎలాన్.. అసలు వ్యక్తి ఎవరో తెలిసే వరకు వేచి చూడండి అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. దీనికి మస్క్ థాంక్యూ రాహుల్, ఇది నిజంగా ఆందోళనకరం అని బదులిచ్చారు. ఇక తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈ వివాదంపై స్పందిస్తూ, వినూత్న శాటిలైట్ ఇంటర్నెట్ సాంకేతికతను భారత్ ఆహ్వానించాలని, కొందరి పారిశ్రామిక ప్రయోజనాల కోసం అంతర్జాతీయంగా బ్రాండ్ ఇండియా ను బలహీనపరచకూడదని పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు దీనిని కేంద్ర ప్రభుత్వం, కార్పొరేట్ దిగ్గజాల బంధానికి నిదర్శనంగా విమర్శించగా, బిఆర్‌ఎస్, బిజెపి వర్గాలు భద్రతా నియంత్రణలను పక్కనబెట్టి విదేశీ సంస్థలకు కార్పెట్ పరిచే ప్రసక్తే లేదని స్పష్టం చేశాయి. ఈ మొత్తం వివాదంపై ముఖేష్ అంబానీ, రిలయన్స్ జియో వర్గాలు ఇప్పటివరకు ప్రత్యక్షంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అయితే, జియో కూడా స్వయంగా అంతరిక్ష ఉపగ్రహ ఇంటర్నెట్ నెట్‌వర్క్‌ను సొంతంగా అభివృద్ధి చేసేందుకు బిలియన్ డాలర్ల ప్రణాళికలతో సిద్ధమవుతోంది. కాబట్టి, విదేశీ దిగ్గజమైన స్టార్‌లింక్ భారత్‌లోకి ముందే అడుగుపెడితే దేశీయ టెలికాం పరిశ్రమకు, ముఖ్యంగా 5జి వ్యాపారానికి గట్టి పోటీ ఎదురవుతుందనేది బహిరంగ రహస్యమే. నిబంధనలు తీరి స్టార్‌లింక్ భారత మార్కెట్లోకి వస్తే మారుమూల ప్రాంతాల్లో నెట్‌వర్క్ విప్లవం రావడం ఖాయం. అయితే డివైజ్ ధరలు, ప్లాన్ చార్జీలు సామాన్యుడికి అందుబాటులో ఉంటాయా లేదా అన్నది ప్రశ్నార్థకమే. ఎలాన్ మస్క్ చేసిన ఆరోపణలు కేవలం ఏకపక్ష వ్యాపార కోపంతో కూడుకున్నవా లేక విదేశీ పెట్టుబడులకు భారత నిబంధనలు కఠినంగా మారుతున్నాయా అనే దానిపై విస్తృత విశ్లేషణలు నడుస్తున్నాయి. జాతీయ భద్రత , డేటా రక్షణ విషయంలో రాజీ పడకుండానే, దేశీయ , అంతర్జాతీయ సంస్థలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా భారత టెలికాం రంగాన్ని ఆరోగ్యకరమైన పోటీ వైపు నడిపించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది. టెక్ దిగ్గజం, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని టార్గెట్ చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. “భారత ప్రధాన మంత్రి అంబానీ గారూ..” అంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్టులు దుమారం రేపుతున్నాయి. భారత్‌లో తన స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు అనుమతులు లభించడంలో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై అసహనం వ్యక్తం చేశారు. దేశీయ టెలికాం రంగాన్ని శాసిస్తున్న ముకేశ్ అంబానీ ప్రయోజనాల కోసమే తమకు అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఇది ముమ్మాటికీ గుత్తాధిపత్యమేనని ఆరోపించారు. భారత్‌లో తన స్టార్ లింక్ ఇంటర్నెట్ సేవలకు అడ్డంకులు తొలగకపోవడంతో రిలయన్స్ అధినేతను, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఎలాన్ మస్క్ సంచలన ఆరోపణలు చేశారు. శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపులు, భారత్‌లోకి స్టార్‌లింక్ ప్రవేశంపై రిలయన్స్ జియోతో వివాదం నడుస్తున్న సమయంలో ఎలాన్ మస్క్ పాత పోస్టులు షేర్ చేసి అటు కేంద్రంలోని బీజేపీని, ఇటు అంబానీని ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. తన ఆరోపణలకు బలం చేకూర్చేందుకు ఎలాన్ మస్క్ ఎక్స్ వేదికగా ‘ఇండియన్ ఎక్స్‌ప్రెస్’, ‘అల్ జజీరా’ గతంలో రాసిన కథనాలను షేర్ చేశారు. ఎలక్టోరల్ బాండ్ల) ద్వారా రిలయన్స్ అనుబంధ సంస్థగా ప్రచారంలో ఉన్న ‘క్విక్ సప్లై’ కంపెనీ, అధికార బీజేపీకి రూ. 385 కోట్లు, శివసేన పార్టీకి రూ. 25 కోట్లు విరాళంగా ఇచ్చిందని ఆ కథనాల్లో కనిపిస్తుంది. బీజేపీకి అందిస్తున్న విరాళాల ద్వారానే రిలయన్స్ అధినేత అంబానీ మద్దతు పొందుతున్నారని మస్క్ ఆరోపించారు. అయితే, క్విక్ సప్లై కంపెనీ ఇండిపెండెంట్ సంస్థ అని, దాంతో తమకు ఎలాంటి సంబంధం లేదని రిలయన్స్ ఇదివరకే క్లారిటీ ఇచ్చింది. మస్క్ చేసిన తాజా వ్యాఖ్యలపై రిలయన్స్ నేరుగా స్పందించలేదు. వెనిజులాలో స్టార్ లింక్ సేవలు ప్రారంభమవుతున్నాయని, అందుకు కావాల్సిన అన్ని పర్మిషన్లు వచ్చాయని మస్క్ మరో పోస్ట్ చేశారు. ఎలాన్ మస్క్ ఆరోపణలను భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. భారత్ ఏ రంగంలోనూ గుత్తాధిపత్యాన్ని అనుమతించదని, అన్ని సంస్థలకు ఒకే విధమైన రూల్స్ ఉంటాయని తెలిపింది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌తో పాటు జియో శాటిలైట్, భారతీ ఎయిర్‌టెల్ మద్దతున్న వన్ వెబ్ కంపెనీలకు కూడా ప్రాథమిక లైసెన్సులు ఇచ్చామని కేంద్రం పేర్కొంది. అయితే వాణిజ్య సేవలు, స్పెక్ట్రమ్ కేటాయింపులకు ముందు భద్రతాపరమైన తనిఖీలు తప్పనిసరి అని, ఏ సంస్థలకు కేంద్రం వత్తాసు పలకాల్సిన అవసరం లేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. అన్ని కంపెనీలకు ఒకే విధమైన భద్రతా నియమాలు వర్తిస్తాయని కేంద్రం స్పష్టం చేసింది. భారత్‌లో స్టార్ లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీస్ తేవాలని మస్క్ ప్రయత్నిస్తున్న క్రమంలో దేశంలోని వ్యాపార నిబంధనలు, స్పెక్ట్రమ్ కేటాయింపు పద్ధతులపై రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌తో ఆ విదేశీ కంపెనీ మధ్య విభేదాలు తలెత్తాయి.

# సౌదీపై హౌతీ దాడులు



పశ్చిమాసియాలో అమెరికా–ఇరాన్ యుద్ధ జ్వాలలు చల్లారకముందే సౌదీ అరేబియాహౌతీల మధ్య ఘర్షణ మళ్లీ తీవ్రరూపం దాల్చడం అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నది. యెమెన్‌లో దశాబ్దకాలంగా కొనసాగుతున్న అంతర్యుద్ధం, ప్రాంతీయ ఆధిపత్య పోరు, ఇరాన్‌సౌదీ పోటాపోటీ వైఖరి ఈ సంక్షోభానికి ప్రధాన కారణం. కాల్పుల విరమణలు, దౌత్య చర్చలు, మధ్యవర్తిత్వ ప్రయత్నాలతో కొంతకాలం కనిపించిన ప్రశాంతత శాశ్వత శాంతికి దారితీయకపోవడం ఈ ప్రాంతంలోని అస్థిరతకు అద్దం పడుతున్నది. ఒకవైపు ఇజ్రాయెల్‌పాలస్తీనా సంక్షోభం, మరోవైపు ఎర్ర సముద్రంలో నౌకలపై దాడుల ముప్పు, ఇంకోవైపు గల్ఫ్ ప్రాంతంలో వ్యూహాత్మక ఆధిపత్యం కోసం పోటీ.. ఈ పరిణామాల మధ్య సౌదీహౌతీ ఉద్రిక్తతలు పెరగడం ఏమాత్రం వాంఛనీయం కాదు. ప్రపంచ వాణిజ్యం, చమురు సరఫరా, ఆహార భద్రత, అంతర్జాతీయ దౌత్యసంబంధాల మీదా ఈ ఘర్షణ తీవ్ర ప్రభావం చూపే ప్రమాదమున్నది.ల 2022లో యెమెన్ ప్రభుత్వం, తిరుగుబాటుదారుల మధ్య కుదిరిన సంధితో సౌదీ అరేబియా, హౌతీల మధ్య ప్రత్యక్ష ఘర్షణలు కొంతకాలం తగ్గుముఖం పట్టినప్పటికీ, యెమెన్ అంతర్యుద్ధానికి శాశ్వత పరిష్కారం మాత్రం లభించలేదు. ఈ ఏడాది జూలైలోనే క్షిపణి దాడులు మళ్లీ మొదలయ్యాయి. అక్టోబర్‌లో పరిస్థితి మరింత విషమించింది. సౌదీ రాజధాని రియాద్ విమానాశ్రయంపై దాడులు, చమురు, మౌలిక సదుపాయాలపై క్షిపణుల ప్రయోగం, సౌదీ ప్రతిదాడులతో ఉద్రిక్తతలు ప్రమాదకర స్థాయికి చేరాయి. ఈ నెల 13న ధహ్రాన్‌లోని సౌదీ అరామ్‌కో ప్రధాన కార్యాలయంపై హౌతీలు దాడి చేశారు. సౌదీ విమానాశ్రయాలు, చమురు కేంద్రాలపై మరిన్ని దాడులు చేస్తామని హౌతీలు హెచ్చరించడం గమనార్హం. ఈ ఘర్షణల వెనుక ప్రాంతీయ శక్తుల ప్రయోజనాలు, ఇరాన్‌సౌదీ విభేదాలు, అమెరికా పాత్ర, ఎర్ర సముద్రంపై నియంత్రణ వంటి అనేక అంశాలు ఉన్నాయి. హౌతీలకు ఇరాన్ మద్దతు ఉండగా, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వానికి సౌదీ అరేబియా అండగా నిలబడుతున్నది. ప్రపంచ ఇంధన మార్కెట్లలో అగ్రస్థానంలో నిలిచే సౌదీ అరేబియా చమురు క్షేత్రాలు, శుద్ధి కేంద్రాలు, ఎగుమతి టెర్మినళ్లు, విమానాశ్రయాలపై దాడులు కొనసాగితే ఉత్పత్తి, రవాణా, సరఫరా వ్యవస్థలు దెబ్బతినే ప్రమాదం ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పెరిగి, ఆర్థిక రంగంపై ఒత్తిడి తేవడం కనిపిస్తున్నది. ఇక్కడ మరో కీలక భౌగోళిక అంశం బాబ్ ఎల్ మందెబ్ జలసంధిలో హౌతీలు జరుపుతున్న దాడులు. సౌదీ అరేబియా సహా గల్ఫ్ దేశాల నుంచి చమురు, ఇతర సరుకుల రవాణాలో జలసంధికి వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్నది. ఈ మార్గంలో నౌకలపై దాడులు పెరుగుతుండటంతో ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషించాల్సి వస్తున్నది. దీనివల్ల పెరిగే అదనపు భారం అంతిమంగా వినియోగదారులపైనే పడుతుంది. భారీ ఇంధన దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశానికి ఇది చిన్న సమస్య కాదు. ఈ ఘర్షణల నిలిపివేతకు, యెమెన్‌లో శాశ్వత శాంతికి ప్రపంచ దేశాలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఐక్యరాజ్యసమితితో పాటు, ఒమన్ వంటి దేశాలు మధ్యవర్తిత్వానికి చురుకైన పాత్ర పోషించాలి. ప్రపంచం మరో విస్తృత యుద్ధాన్ని భరించే స్థితిలో లేదు.

# జూరాల నీళ్లడిగితే రైతులకు సంకెళ్లా?



ఆ క్రమంలో తోపులాట, గొడవ జరిగింది. అయితే ఆ అన్నదాతలు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించారని ఇరిగేషన్ అధికారులు అమరచింత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మరునాడే 14 మంది రైతులపై నాన్ బెయిలెబుల్ కేసులు నమోదు అయ్యాయి. ఇప్పుడు వారి ఇండ్లపై పోలీసుల నిఘా ఉన్నది. ఏ క్షణాన అయినా వారిని అరెస్టు చేసి జైలుపాలు చేయొచ్చు. వారిపై భారత న్యాయ సంహితలోని పదికి పైగా సెక్షన్లను మోపారు. జూరాల నీటి విడుదల సందర్భంగా రైతులెవరూ ఆఫీసులోకి చొరబడి అధికారుల విధులకు ఆటంకం కలిగించలేదు. ఎవరిపైనా భౌతిక దాడులకు పాల్పడలేదు. అంతకుముందే ఎండిపోతున్న పంటలకు నీరు ఇవ్వండి అంటూ ఇరిగేషన్ ఆఫీసుల చుట్టూ రోజుల తరబడి తిరిగారు. ఎన్ని రోజులైనా అధికారులు పంటల వైపు రాలేదు. ఫోన్లు చేసినా బదులు ఇవ్వలేదు. ఏ దారీలేని రైతులు చివరకు ప్రాజెక్టు వద్ద నిరసనలు చేపట్టారు. వారిని శాంతింపజేసే ప్రయత్నాలు ప్రభుత్వం వైపు నుంచి జరుగలేదు. నీరు విడుదల చేసే ప్రసక్తే లేదని మంత్రులు ప్రకటించారు. పది రోజుల ఆందోళన తర్వాత కూడా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో కడుపుమండిన రైతులు స్వయంగా నీళ్లు విడుదల చేసుకున్నారు. ఇందులో రైతుల పరిస్థితిని అర్థం చేసుకోని, వారి ఆవేదనను పట్టించుకోని ప్రభుత్వానిదే నేరం. ఇది కేవలం కేసుల పాలైన 14 మంది రైతుల ఆగ్రహం మాత్రమే కాదు, బాధిత రైతులు లక్షల్లో ఉన్నారు. వర్షాలు లేని కారణంగా అందరి కన్నా ఎక్కువగా నష్టపోయేది రైతులే. వారి దుస్థితిని సానుభూతితో అర్థం చేసుకోవలసిన బాధ్యత ప్రభుత్వానిది. పంటల నష్టం, ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేని రైతులు మరిన్ని రూపాల్లో కూడా తమ ఆందోళనలను ప్రకటించవచ్చు. అందరిపై కేసులు పెడుతూ పోతే ప్రజాగ్రహం పెల్లుబుకుతుంది. రైతులు పండించేది వారి ఒక్కరి కడుపు నింపుకోవడానికి కాదు. సమాజంలోని అందరి ఆకలి చల్లార్చేది అన్నదాతలే. పంటలను కాపాడేందుకు వారు స్వయంగా నీళ్లు విడుదల చేసుకున్నది కూడా అందుకే. ఆ రైతులు నీళ్లు విడుదల చేసే సాహసం చేయకపోయి ఉంటే మంత్రులు హడావుడిగా సెప్టెంబర్ 24న బెంగుళూరు వెళ్లి కర్ణాటక ముఖ్యమంత్రిని కలిసి జూరాలకు నీళ్లు వదలాలని కోరేవారే కాదు. ఇది ఆ రైతులు కేసులు మోస్తూ సాధించిన విజయం కాదా? నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి విడతలవారీగా 3 టీఎంసీల నీళ్లు అందిస్తామన్న కర్ణాటక సీఎం డీకే శివకుమార్ మాట చెల్లుబాటు కాలేదు. సెప్టెంబర్ చివరి వారంలో కర్ణాటకలో పడిన వర్షాల ద్వారా వచ్చిన నీరు మాత్రమే జూరాల చేరింది. ఆ తర్వాత ఆగిపోయింది. నారాయణపూర్, ఆల్మట్టి డ్యామ్‌లలో సమృద్ధిగా నీళ్లున్నాయి, వారబందీ లెక్కన పది రోజుల పాటు మనకు నీళ్లందుతాయి. రెండు రోజుల్లో జూరాలకు చేరుతాయి అని ప్రకటించిన అధికారుల మాట తేలిపోయింది. ఏది ఏమైనా తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నం ఫలించలేదు. జూరాల ఆయకట్టు కింది చివరి పొలాలు ఎండిపోతున్నాయి. నీళ్లు ఇస్తామని మాట తప్పిన కర్ణాటకలో ఉన్నదీ కాంగ్రెస్ ప్రభుత్వమే. మరి సమన్వయం చేసుకుంటూ రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత తెలంగాణ పాలకులకు లేదా? రైతులను బలి చేయడం న్యాయమా?

# కరువుపై సర్కార్ చోద్యం

ఎల్ నినో అంటే కేవలం వాతావరణ పరిణామం కాదు, అది వ్యవసాయం, నీటి భద్రత, ఆహార భద్రత, ప్రజల జీవనంపై ప్రభావం చూపే సవాల్. కానీ ప్రభుత్వం ఎల్ నినో హెచ్చరికలను లెక్క చేయకుండా సంక్షోభం వచ్చే వరకు కాలయాపన చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయంలో విలువైన సమయం వృథా చేసింది. సాగు, తాగునీటి భద్రతపై చర్యలు చేపట్టలేదు. వాతావరణశాఖ అంచనాల ప్రకారం ఎల్ నినో గతంలో నమోదైన అత్యధిక స్థాయిని మించే అవకాశం ఉన్నది. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నది. లేకపోతే సాగు ఆగమై, ప్రజల జీవనం దుర్భరంగా మారుతుంది. కరువు ఒక రంగానికి సంబంధించిన సమస్య కాదు. సాగునీరు, వ్యవసాయం, విద్యుత్తు, తాగునీరు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అన్నింటినీ ప్రభావితం చేసే గొలుసు ప్రభావం. ఈ ప్రమాదం రానున్నదని రాష్ట్ర ప్రభుత్వానికి కూడా తెలుసు. కరువును ఎదుర్కొనేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అసలు ప్రశ్న ప్రభుత్వం హెచ్చరికను గుర్తించిందా లేదా అనేదే ముఖ్యం కాదు, ఆ హెచ్చరికకు తగిన వేగంతో చర్యలు తీసుకుంటున్నదా అనే ముఖ్యం. తెలంగాణకు ఆధారమైన అతిపెద్ద సహజ వనరు గోదావరి. ముఖ్యంగా ప్రాణహితగోదావరి సంగమం తర్వాత కన్నెపల్లి ప్రాంతంలో అందుబాటులోకి వచ్చే నీటిని సురక్షితంగా వినియోగించుకునే అవకాశాలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలి. కానీ ఈ విషయంలో ప్రభుత్వం విలువైన సమయాన్ని కోల్పోయింది. గోదావరిలో లభిస్తున్న నీటిని సాధ్యమైన మేరకు వినియోగించుకోవాలని, కన్నెపల్లి పంప్ హౌస్‌తోపాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వ్యవస్థలో సురక్షితంగా ఉపయోగించగల భాగాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని వానకాలం ప్రారంభంలోనే రిటైర్డ్ ఇంజినీర్లు, నీటిపారుదల నిపుణులు సూచించారు. కానీ ప్రభుత్వం పెడచెవినపెట్టింది. మరోవైపు కండ్లముందుగా ప్రవహిస్తున్న గోదావరి నీటిని సురక్షితంగా వినియోగించుకునే అవకాశాలను కోల్పోవడం పరిపాలనా దూరదృష్టి లోపంగానే కనిపిస్తున్నది. ఎల్ నినో ప్రభావం తీవ్రమైతే ప్రభుత్వం పంటలు, జిల్లాల వారీగా నీటి భద్రతా ప్రణాళిక రూపొందించాలి. ఇప్పటికే సాగులో ఉన్న పంటలను ముందుగా రక్షించాలి. ఏ ప్రాజెక్టులో ఎంత నీరున్నది? ఆ ప్రాజెక్టుల కింద ఎంత ఆయకట్టు ఉన్నది? ఎంత నీరు అవసరం ఉన్నది? అనే వివరాలను ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించాలి. అంతేకాకుండా చెరువుల పునరుద్ధరణ, భూగర్భజలాల సంరక్షణ వంటి చర్యలను చేపట్టాలి. రైతులకు కేవలం సలహాలు ఇవ్వడం సరిపోదు. నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళికను రూపొందించి, ఆ ప్రణాళికను అమలు చేయడానికి ప్రభుత్వం ఆర్థిక, సాంకేతిక సాయం అందించాలి. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గితే గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణాల మీదా ఒత్తిడి పెరుగుతుంది. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరానికి వేసవిలో తాగునీటి అవసరం మరింత పెరుగుతుంది. అందువల్ల ప్రభుత్వం తాగునీటి భద్రతా ప్రణాళిక రూపొందించాలి. ప్రతి ప్రధాన రిజర్వాయర్లో ప్రస్తుతం ఎంత నీరు ఉన్నది? సాధారణ వినియోగంతో అది ఎన్ని నెలలకు సరిపోతుంది? ప్రత్యామ్నాయ వనరులు ఏమిటి? అత్యవసర పరిస్థితిలో ఏ వనరుల నుంచి నీటిని తీసుకురావచ్చు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఉండాలి. హైదరాబాద్‌తోపాటు అన్ని మున్సిపాలిటీలకు ప్రధాన నీటి వనరు, ప్రత్యామ్నాయ వనరు, అత్యవసర వనరు అనే మూడు స్థాయిల నీటి భద్రతా వ్యవస్థ ఉండాలి. వర్షాభావ పరిస్థితుల్లో విద్యుత్తు రంగం మీదా ప్రభావం పడుతుంది. నీటి కొరత వల్ల జల విద్యుత్తు ఉత్పత్తి తగ్గుతుంది. అదే సమయంలో వేసవి వేడి పెరిగితే గృహాలు, వ్యవసాయం, పరిశ్రమల నుంచి విద్యుత్తు డిమాండ్ పెరుగుతుంది. కాబట్టి విద్యుత్తు కొనుగోలు, థర్మల్ విద్యుత్తు ఉత్పత్తికి అవసరమైన ఇంధన నిల్వలు, వ్యవసాయానికి నిరంతర సరఫరా వంటి అంశాలపై ప్రభుత్వం ముందుగానే చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే లేదా ఏర్పాటు చేసిన వార్ రూమ్ కేవలం అధికారుల సమావేశాలకు పరిమితం కాకూడదు. ప్రతి వారం ప్రజలకు ఒక స్పష్టమైన పరిస్థితి నివేదిక ఇవ్వాలి: జిల్లాల వారీగా వర్షపాతం, ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు, గోదావరి, కృష్ణా నదుల ప్రవాహాలు, తాగునీటి లభ్యత, సాగునీటి విడుదల, పంటల సాగు విస్తీర్ణం, భూగర్భజల పరిస్థితి, విద్యుత్తు డిమాండ్, సరఫరా వంటి అంశాలపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలి. రానున్న వారాల్లో వాతావరణ అంచనాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఈ సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఎల్ నినో అనేది ప్రకృతి పరిణామం. దాని ప్రభావాన్ని ఎంతవరకు తగ్గించగలమో అని అలోచించాల్సింది మాత్రం ప్రభుత్వమే. ప్రజలపై కరువు ప్రభావం ఏ మేరకు పడుతుంది అనేది పాలక పెద్దలు తీసుకునే నిర్ణయాలపై ఆధారపడి ఉంటుం ది. అందుకే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణకు ఒక్కరోజు కూడా ఆలస్యం చేయకూడదు. పనులకు కచ్చితమైన గడువు నిర్ణయించి, పురోగతిని ప్రజలకు తెలియజేయాలి. నీటి భద్రతను వాయిదా వేయడం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధం. కొన్ని నెలల్లో రాజకీయ వివాదాలు, పరస్పర ఆరోపణలు, అనవసరమైన అంశాలపై సమయం కేటాయించిన పాలకులు, నీటి సమస్య పరిష్కారం మీదా దృష్టి పెట్టాలి.

# ఉప్పల్ లో శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, అక్టోబర్ 14 ( మన మీ వార్త):**

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి ఉప్పల్ లోని పురాతన శ్రీ మహంకాళి దేవాలయంతో పాటు బోపన్ చెరువు కట్ట మైసమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉప్పల్ శ్రీ మహంకాళి దేవాలయంలో చండీ రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బోపన్ చెరువు కట్ట మైసమ్మ ఆలయంలోనూ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్‌లోని చారిత్రక శ్రీ మహంకాళి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని చండీ రాజరాజేశ్వరి అలంకరణలో దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. నవరాత్రి ఉత్సవాలను





భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తూ, అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి పూజించడం విశేషమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతంలో దసరా పండుగను ప్రజలు ఎంతో వైభవంగా జరుపుకుంటారని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, క్షేమం కోసం అమ్మవారిని ప్రార్థించినట్లు వెల్లడించారు. ప్రజలందరికీ ముందస్తుగా విజయదశమి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహంకాళి దేవాలయం ఆలయ కమిటీ చైర్మన్ తెల్కల మోహన్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఘన స్వాగతం పలికి సన్మానించిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)

**ఉప్పల్, అక్టోబర్ 14 ( మనం ఈ వార్త):**

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఉప్పల్ నల్ల చెరువు రోడ్డులో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ మర్యాదపూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. పోచారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ ప్రాజెక్టుకు భూమిపూజ కార్యక్రమాన్ని పూర్తి చేసుకుని తిరిగి వెళ్తున్న మంత్రిని ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అభినందనలు తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ముందుకు తీసుకెళ్తూ, నిరుపేద కుటుంబాలకు గృహ భరోసా కల్పించేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని ఇర్షాద్ ఖాన్





పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, పేదల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. పోచారంలో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ ప్రాజెక్టుకు భూమిపూజ జరగడం స్థానిక ప్రాంత అభివృద్ధికి మరో ముందడుగు అని, ఈ ప్రాజెక్టు ద్వారా అర్హులైన పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ముందుకు తీసుకెళ్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఇర్షాద్ ఖాన్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఉప్పల్ మినీ శిల్పారామంలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలుపూల బతుకమ్మలతో మహిళల సందడి..

– శివకుమార్ శిష్య బృందం నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణ

**ఉప్పల్, అక్టోబర్ 14 ( మన మీ వార్త):**

ఉప్పల్ మినీ శిల్పారామంలో బతుకమ్మ పండుగ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు సందడి చేయగా, సంప్రదాయ ఆటపాటలతో ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకుంది. సాయంత్రం సందర్శకులతో కలిసి మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలాడుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాట్య గురువు శివకుమార్ శిష్య బృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వినాయక కౌతం, నమశ్శివాయతే, జతిస్వరం, శివస్తుతి, మూషిక వాహనంతో పాటు అన్నమాచార్య కీర్తనలు, గరుడ








గమన, అయిగిరి నందిని, భో శంభో తదితర అంశాలను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. లీలావతి, కవిత, దీక్ష, శాన్వి, అమృత, తనిష్క, హానిక, నిశిత, పూజ్యశ్రీ, అధ్య తదితర చిన్నారులు తమ నృత్య ప్రతిభతో అలరించారు. శాస్త్రీయ నృత్యాలు, భక్తి గీతాలు, అన్నమయ్య కీర్తనలతో కార్యక్రమం ఆహ్లాదకరంగా సాగింది.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయ ఆటపాటలతో పాటు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో నిర్వహించడం విశేషంగా నిలిచింది. పూల పండుగ సందడితో ఉప్పల్ మినీ శిల్పారామం కళకళలాడగా, ఈ వేడుకలు సందర్శకులకు ప్రత్యేక అనుభూతిని అందించాయి.

## జవహర్ నగర్ డివిజన్ సుక్కమ్మ బస్తిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**జవహర్ నగర్, అక్టోబర్ 14: (వార్త ప్రతినిధి)**

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా, కీసర సర్కిల్, జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని సుక్కమ్మ బస్తిలో సీసీ రోడ్డు పనులను ఘనంగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మేయర్, జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ సంగారెడ్డి శారదా మనోహర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ పాల్గొని కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుక్కమ్మ బస్తిలో చాలా కాలంగా రోడ్లు దెబ్బతిని కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు సీసీ రోడ్డు మంజూరు చేయించి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. రోడ్డు పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.



జవహర్ నగర్ డివిజన్ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, గతంలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులన్నింటినీ దశలవారీగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కాలనీలో డ్రైనేజీ, తాగునీటి సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ గౌడ్, సుబ్రహ్మణ్యం, గజ్వేల్ శంకర్, రఫీక్, మేడ్చల్ నియోజకవర్గ ానా బ్లాక్ అధ్యక్షులు మాట్లా శ్రీనివాస్, జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు మాట్లా వినయ్, వీర్ల బుజంగం, విజయ్ రాయ్, గండి సునీత, ఋూరా వెంకటేష్, నాయకం భాస్కర్, కొలిపాక సాయి కిరణ్, వెంకటేష్, సుబ్రహ్మణ్యం రాజు, వీరభాస్కర్ రాజు మరియు కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

కాలనీ వాసులు మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా పని చేయాలి





– ఎన్.ఎస్.యు.ఐ, యూత్ కాంగ్రెస్ శ్రేణులకు పరమేశ్వర్ రెడ్డి పిలుపు

**ఉప్పల్, అక్టోబర్ 14 ( మన మీ వార్త ):**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా పని చేయాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రుల నుంచి ఓటరు నమోదు చేయాలని సూచించారు. కాలనీలలో ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసి అర్హత కలిగిన పట్టభద్రుల వివరాలను సేకరించడంతో పాటు ఓటరుగా నమోదు చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే జారీ జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఉప్పల్ నియోజకవర్గంలోని ఎన్.ఎస్.యు.ఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు విషయంలో అనుసరించాల్సిన వ్యూహాన్ని గురించి పరమేశ్వర్ రెడ్డి ఎన్.ఎస్.యు.ఐ, యూత్ కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎన్ ఎస్ యు ఐ ఆకారపు అరుణ్, కిషోర్ కుమార్ డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## బీజేపీ హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడిగా చింతకింది ప్రవీణ్ నియామకం

– పార్టీ అభివృద్ధికి, అధిష్ఠానం నిర్ణయించిన కార్యక్రమాల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా: ప్రవీణ్

**హబ్సిగూడ, అక్టోబర్ 14 ( మన మీ వార్త):**



భారతీయ జనతా పార్టీ (బీజేపీ) హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడిగా చింతకింది ప్రవీణ్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు డి. గిరి వర్ధన్ రెడ్డి బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ సంస్థాగత బలోపేతం, డివిజన్ పరిధిలో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రవీణ్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన చింతకింది ప్రవీణ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడిగా నియమించిన జిల్లా అధ్యక్షుడు డి. గిరి వర్ధన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ ప్రతిష్ఠను మరింత పెంపొందించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం, రాష్ట్ర, జిల్లా నాయకత్వం నిర్ణయించే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. అందరినీ కలుపుకొని పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

తన రాజకీయ ప్రస్థానంలో ప్రోత్సాహం అందిస్తూ డివిజన్ అధ్యక్షుడిగా నియామకం కావడానికి సహకరించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్ రెడ్డి, బీజేపీ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, జిల్లా అధ్యక్షుడు డి. గిరి వర్ధన్ రెడ్డికి చింతకింది ప్రవీణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, హబ్సిగూడ డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి పనిచేస్తానని ఆయన వెల్లడించారు.

## సాయిరాం నగర్ డబుల్ బెడ్ రూమ్ సముదాయాల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ





**ఉప్పల్, అక్టోబర్ 14 ( మన మీ వార్త):**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని సాయిరాం నగర్ రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ముఖ్య ఇంజినీర్ ఎం. చైతన్య కుమార్‌ను కలిసి లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఆయన వివరించారు. సాయిరాం నగర్‌లోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయంలో పనిచేయకుండా నిలిచిపోయిన లిఫ్టులకు మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా అన్ని భవన సముదాయాల్లో పైకప్పులపై నేలపరచే పనులు చేపట్టాలని, వర్షపు నీరు ఇళ్లలోకి కారకుండా పైకప్పులకు నీటి నిరోధక పూత పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ నాయకులు బైరి నవీన్ గౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నూతన గృహ ప్రవేశానికి హాజరైన వొడితల ప్రణవ్..





మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి అక్టోబర్ 14

అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తూ వారికి ఆర్థిక భరోసా అందించి సొంతింటి కళను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.హుజురాబాద్ పట్టణ పరిధిలోని 29 వార్డులో ఇందిరమ్మ ఇంటి నూతన గృహ ప్రవేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఎన్నో ఏళ్లుగా నిర్మించుకోవాలనుకున్న సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వం నేరవేర్చిందని,ప్రభుత్వానికి,ఇంచార్జి ప్రణవ్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు లబ్ధిదారులు తెలిపారు.రెండవ విడత ఇందిరమ్మ లబ్ధిదారులకు త్వరలో మంజూరు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,స్థానిక కౌన్సిలర్ మొగిలి,కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బతుకమ్మ పండుగ ఏర్పాట్లను పరిశీలించిన వొడితల ప్రణవ్...





మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి అక్టోబర్ 14

పూలను ప్రకృతిగా భావించి పూజించే గొప్ప పండుగ,తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను ప్రతిబింబించి బతుకునిచ్చే పండుగ బతుకమ్మ అని,ఈ సారి సద్దుల బతుకమ్మ పండుగ ఏర్పాట్లకు సంబంధించి మున్సిపల్ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.బుధవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని బతుకమ్మ సొల్లలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన స్వయంగా వెళ్లి పరిశీలించారు.బతుకమ్మ నిమజ్జన సమయంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని,శానిటేషన్,పరిసరాల పరిశుభ్రత,లైటింగ్ పై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,మున్సిపల్ అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బీరప్పగడ్డ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా రాచకొండ శివ కుమార్

బీరప్ప గడ్డ, అక్టోబర్ 14 ( మన మీ వార్త):



మేడ్చల్-- మల్కాజిగిరి జిల్లా, ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని బీరప్పగడ్డ డివిజన్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షుడిగా రాచకొండ శివ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా రాచకొండ శివ కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో డివిజన్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, సీనియర్ నాయకులు, కార్యకర్తల సహకారంతో బీరప్పగడ్డ డివిజన్‌లో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# మోదీ 25ఏళ్ల పాలనలో అభివృద్ధి దిశగా భారత్

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 14, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-






దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో భారతదేశం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని ప్రపంచంలో విశ్వ గురువుగా నిలువస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా రాజకీయ జీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రద్ధానంద్ గంజిలో బుధవారం " చాయ్ మిలన్ ఏ మోదీ జీ 25c కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 13 ఏళ్లు ముఖ్యమంత్రిగా 12 ఏళ్ల దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ ఎనలేని ప్రజాసేవ చేస్తున్నారని గుర్తు చేశారు. అనేక పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చి రైతులు, మహిళలు, పేద కుటుంబాలు, వృద్ధులు, విద్యార్థులు, చిరు వ్యాపారులకు అండగా నిలుస్తున్నారన్నారు. వైద్యం, ఇల్లు, బ్యాంకింగ్, ఆహార భద్రత వంటి రంగాల్లో పెనుమార్పులు తీసుకొచ్చారన్నారు. జన్ధన్ యోజన ఉజ్వల యోజన కిసాన్ సామాన్ నిధి ఆయుష్మాన్ భారత్ ఆవాస్ యోజన గరీబ్ కళ్యాణ్ అన్న యోజన జల్జీవన్ మిషన్ తదితర పథకాలతో కోట్ల మంది లబ్ధిపొందుతున్నారన్నారు. 2014 తర్వాత జాతీయ రహదారులు, రైల్వే, ఆసుపత్రులు, అంతరిక్షం, వైమానిక, సైనిక రంగాల్లో ఎన్నో రెట్ల వృద్ధి జరిగిందన్నారు. భారతదేశ జిడిపి 10వ స్థానం నుంచి ఏకంగా 4వ స్థానంకి ఎగబాకడం కేవలం మోదీ వల్లనే సాధ్యమైందని చెప్పారు. అనంతరం ఇందూరు ఛాయ్ వాలా మాదాసు స్వామి యాదవ్ మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో చిరస్మరణీయమైన నాయకుడు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అని కొనియాడారు. నిరుపేద తల్లి కడుపున పుట్టి రైలులో చాయ్ విక్రయిస్తూ ప్రధాని స్థాయికి ఎదిగారన్నారు. 25 సంవత్సరాల ఈ ప్రజా రాజకీయ జీవితం రాబోయే తరాలకు మార్గదర్శనం వంటిదన్నారు. తన కుటుంబ ములాలు కూడా చాయ్ అమ్మిన కుటుంబానికి చెందినవి కావడం పట్ల ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు శ్యామ్, కార్పొరేటర్లు బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, నిజామాబాద్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కమల్ కిషోర్ , గుమస్తా సంఘం అధ్యక్షులు బాలు, దడువై సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, హమాలీ సంఘం అధ్యక్షులు అంజయ్య యాదవ్, పైట వెంకటేశం, ఆగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ త్రిశక్తి నల్ల పోచమ్మ దేవాలయంలో సామూహిక కుంకుమార్చన.. పాల్గొన్న ఈటల జమున

ఉప్పల్, అక్టోబర్ 14 ( మన మీ వార్త):





శ్రీ త్రిశక్తి నల్ల పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ సతీమణి శ్రీమతి ఈటల జమున రాజేందర్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆమె అమ్మవారిని దర్శించుకుని భక్తితో పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా శ్రీ త్రిశక్తి నల్ల పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి, అనంతరం సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. వేదమంత్రాలు, భక్తుల అమ్మవారి నామస్మరణల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో అలరారింది. నవరాత్రి పర్వదినాల్లో అమ్మవారి అనుగ్రహం పొందేందుకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండగా, సామూహిక కుంకుమార్చన కార్యక్రమం భక్తుల్లో విశేష ఆధ్యాత్మిక భావనను నింపింది.ఈటల జమున రాజేందర్ అమ్మవారికి పూజలు సమర్పించి, లోకకల్యాణం, ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజల్లో పాల్గొనడం ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందని భక్తులు పేర్కొన్నారు.శ్రీ త్రిశక్తి నల్ల పోచమ్మ దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు భక్తి పారవశ్యంతో కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ప్రసాద్, బిజెపి సీనియర్ నాయకులు గడ్డం సాయికిరణ్ స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాకతీయుల రాజధాని ఏకశిలానగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్ర మహటరీత్సవములు నాల్గవ రోజు







మన మీ వార్త అక్టోబర్ 14 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :

ఉదయం గం। 04-00లకు నిత్యాహ్నికం నిర్వర్తించిన పిమ్మట అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించి పూజారాధనలు జరిపారు. మంత్రదీక్ష తీసుకొని సాధకుడు మంత్రానుష్టానం చేస్తుండగా అమ్మవారు ధనమూలమిదం జగత్ అని కదా అందుకోసం సాధకుడి అనుష్ఠానం పట్ల ప్రసన్నమైన అమ్మవారు సాధకుడికి అమితమైన ఐశ్వర్యాన్నిస్తుంది అనటానికి సంకేతంగా అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించడంలోని నేపథ్యం, నవరాత్రులలో మహాలక్ష్మి రూపంలోని దర్శించిన భక్తులకు అఖండలక్ష్మి ప్రాప్తి కలిగిస్తుంది. నవదుర్గా కల్పోక్త నవరాత్ర పూజా విధానాన్ని అనుసరించి అమ్మవారిని కూష్మాండీ మరియు గిరిజ క్రమాలలో పూజారాధనలు జరిపారు. ఈ రోజు సాధకుని మనస్సు అనాహత చక్రం నందు స్థిరమౌతుంది. కావున ఈ దినమున సాధకుడు మిక్కిలి పవిత్రమైన మనస్సుతో కూష్మాండాదేవి స్వరూపాన్ని ధ్యానిస్తూ పూజలు జరపాలి. తద్వార అమ్మవారు భక్తుడి ఉపాసనకు పరితృప్తయై అసురీ శక్తులను భక్తుల నుండి దూరం చేస్తుంది. గిరిజా క్రమంలో ఆరాధింపబడిన అమ్మవారు సాధకులకు సకల సౌభాగ్యాలు ప్రాప్తింప జేస్తుంది. ఈ రోజు అమ్మవారిని ఉదయం సూర్యప్రభ వాహనం మీద సాయంకాలం హంస వాహనం మీద ఊరేగింపు జరిపారు. ఉదయం సూర్యప్రభ వాహనం మీద సావిత్రిగా అలంకరించి సాయంకాలం హంస వాహనంపై బ్రాహ్మీమాతగా అలంకరించి ఊరేగించారు. సూర్యప్రభ వాహనం మీద సావిత్రి మాతగా ఊరేగుతున్న అమ్మవారిని దర్శించిన వారికి ధర్మశ్రద్ధ ఏర్పడుతుంది. యతో ధర్మ స్థతో జయ అని కదా శాస్త్ర వచనం. ధర్మాన్ని నమ్ముకున్నవాడు విజయం సాధిస్తాడు. అట్లాగే హంస వాహనం మీద బ్రహ్మీమాతగా ఊరేగుతున్న అమ్మవారిని దర్శించడం వలన మేధాశక్తి కలిగి ఉంటాడు. మంచి, చెడు విచక్షణ కలిగి ఉంటాడని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఈ రోజు కార్యక్రమాలకు శ్రీ గంద్ర భూపాల్ రెడ్డి-రూపా దంపతులు, శ్రీ గంద్ర అభిలాష్ రెడ్డి-దివ్య దంపతులు, శ్రీ గంద్ర సాయికృష్ణారెడ్డి-భావనాంజలి దంపతులు, శ్రీ అనసూరి శ్రీనివాస్-బాలజనని దంపతులు, శ్రీ అట్టం శంతన్ పటేల్- శ్రీగంధ దంపతులు, శ్రీ ముప్పిడి సుధీర్ రెడ్డి- అర్పిత తదితరులు ఉభయదాతలుగా వ్యవహరించారు. పూజానంతరం ఉభయదాతలకు శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రత్యేక క్యూలైన్లు, మంచినీటి సౌకర్యం మరియు మధ్యాహ్న భోజనం ఏర్పాట్లను ఆలయ ఈ.ఓ శ్రీమతి రామల సునీత పర్యవేక్షించారు. దేవాలయమును సందర్శించిన భక్తులందరికీ శ్రీ భద్రకాళీ సేవా నమితి కన్వీనర్ శ్రీ అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి అశేష అన్నదానం నిర్వహించారు.

ఈ రోజు అమ్మవారిని తొగుట పీఠాధీశ్వరులు శ్రీ మాదవానంద నరస్వతీ స్వామివారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన స్వామివారికి ఆలయ ఈఓ శ్రీమతి రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ఆలయ మహామండపంలో భక్తులను ఉద్దేశ్యించి తమ అనుగ్రహ భాషణం తెలిపారు. అనంతరం దేవాలయములో తయారు చేయబడుచున్న నూతన రథమును పరిశీలించారు.

సాయంకాలం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం మరియు కూచిపూడి నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించాయి.
రామల సునీత కార్యనిర్వహణాధికారి.

# శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే సునీతా రెడ్డి

– భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణోత్సవం

శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (14):

శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతా రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగానిర్వహించారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులుపొందారు.ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రమణా గౌడ్,ఆలయ కమిటీ సభ్యులు,స్థానికప్రజాప్రతినిధులు,నాయకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

## జీడబ్ల్యూఎంసీలో బతుకమ్మ సంబరాలకు ఘనంగా ఏర్పాట్లు

**- మహిళా ఉద్యోగులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలి: కమిషనర్ టి. వెంకన్న**

మన మీ వారి అక్టోబర్ 14 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :



**జీడబ్ల్యూఎంసీ, అక్టోబర్ 14:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న సంబంధిత అధికారులను ఆదేశించారు.

వేడుకల సందర్భంగా విద్యుత్ దీపాలంకరణ, సౌండ్ సిస్టమ్, పారిశుధ్యం, ఫాగింగ్, తాగునీరు, బతుకమ్మల తయారీ, మహిళా సంఘాల సమీకరణ, ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు తదితర ఏర్పాట్ల కోసం అధికారులకు ప్రత్యేక బాధ్యతలు కేటాయిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, తమకు అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేసి వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. జీడబ్ల్యూఎంసీలో పనిచేస్తున్న అన్ని విభాగాల మహిళా ఉద్యోగులు, మహిళా సంఘాల ప్రతినిధులు, నగర మహిళలందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మలతో పెద్ద సంఖ్యలో హాజరై, ఆటపాటలతో సంబరాల్లో పాల్గొని వేడుకలకు మరింత శోభ తీసుకురావాలని కమిషనర్ టి. వెంకన్న పిలుపునిచ్చారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను అందరి భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో నిర్వహించి, వరంగల్ నగర సంప్రదాయాల గొప్పతనాన్ని చాటాలని ఆయన కోరారు.

## జిల్లాలో లాటరీ పద్ధతిలో డ్రా నిర్వహణ



మన మీ వార్త అక్టోబర్ 14 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

**మహబూబాబాద్, అక్టోబర్.14 :** జిల్లాలో నూతనంగా ప్రతిపాదించబడిన కేసముద్రం మున్సిపాలిటీలో 2బీ బార్ లైసెన్స్ కేటాయింపునకు సంబంధించి, అర్హులైన దరఖాస్తుదారుల సమక్షంలో తేది. 16.10.2026 ఉదయం 10.00 గంటలకు ×ఐడిఓసి మహబూబాబాద్ కాన్ఫరెన్స్ హాల్ గ్రౌండ్ ఫ్లోర్ లోని రూమ్ నంబర్: 29 లో, లాటరీ పద్ధతిలో డ్రా జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్, మహబూబాబాద్ గారిచే నిర్వహించబడుతుందని జిల్లా ప్రొహిబిషన్ ఽ ఎక్సైజ్ అధికారి కరంచంద్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ డ్రా ప్రక్రియ ప్రభుత్వ నిబంధనలు మరియు మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగానిర్వహించబడుతుందని సంబంధిత దరఖాస్తుదారులు నిర్ణయ సమయానికి అనగా 9.30 గంటలకు, అవసరమైన గుర్తింపు పత్రాలతో/ఎంట్రీ పాస్‌లతో హాజరుకావలసిందిగా తెలిపారు.

దరఖాస్తుదారులు డ్రా నిర్వహణకు సంబంధించి అధికారుల సూచనలు పాటిస్తూ, ప్రక్రియ సజావుగా జరిగేందుకు సహకరించవలసిందిగా అధికారి ఈ సందర్భంగా కోరారు.

## శ్రీ రాఘవేంద్ర నగర్లో రూ.13 లక్షలతో మంచినీటి పైప్లైన్ పనులు

**- త్వరలో సిమెంట్ రోడ్ల నిర్మాణం ప్రారంభం: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్**

హెచ్ఎంటీ నగర్, అక్టోబర్ 14 ( మన మీ వార్త):



ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో ఉన్న శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీలో రూ.13 లక్షల వ్యయంతో చేపట్టిన మంచినీటి పైప్‌లైన్ పనులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ బుధవారం స్థానిక కాలనీవాసులతో కలిసి పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తయిన వెంటనే, ఇప్పటికే మంజూరైన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు.

కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని సాయిజెన్ శేఖర్ పేర్కొన్నారు. అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేసి కాలనీవాసుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి సంఘం యాదగిరి, విటల్ యాదవ్, గణేష్, వెంకటరెడ్డి తదితరులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## దేవాపూర్ పరిసర గ్రామాల్లో ఆరు బోర్‌వెల్ల ఏర్పాటు

**- తాగునీటి సమస్య పరిష్కారానికి అదానీ ఫౌండేషన్ చొరవ**

కాసిపేట, అక్టోబర్ 14 (మన మీ వార్త మండల ప్రతినిధి) :




గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాల మెరుగుదలే లక్ష్యంగా అదానీ సిమెంట్--ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్ (ఓసీఎల్) ఆధ్వర్యంలోని అదానీ ఫౌండేషన్ దేవాపూర్ పరిసర గ్రామాల్లో ఆరు బోర్‌వెల్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ఈ పనులను చేపట్టింది.దేవాపూర్ పరిసర ప్రాంతాల్లోని మూడు గ్రామ పంచాయతీల పరిధిలో బోర్‌వెల్లు ఏర్పాటు చేయనున్నారు. దేవాపూర్ గ్రామ పంచాయతీలో నాలుగు, గట్రవుపల్లి, మద్దిమడ గ్రామ పంచాయతీల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఆరు బోర్‌వెల్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా బుధవారం దేవాపూర్ హనుమాన్ మందిరం ముందు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఓరియంట్ సిమెంట్ దేవాపూర్ సివిల్ హెడ్, అడ్మిన్ హెడ్‌తో పాటు సీఎస్ఆర్, హెచ్ఆర్ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. దేవాపూర్ సర్పంచ్ రాందాస్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు హాజరై కార్యక్రమానికి మద్దతు తెలిపారు.గ్రామీణ ప్రజలకు తాగునీటి సౌకర్యాలు మెరుగుపరిచే దిశగా అదానీ ఫౌండేషన్ చేపట్టిన ఈ కార్యక్రమంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చండి రూపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నవదుర్గ మహా పడిపూజ కార్యక్రమం

అక్టోబర్ 14 మన మీ వార్తా ప్రతినిధి వెల్దుర్తి

మండల కేంద్రమైన వెల్దుర్తిలో శ్రీ దుర్గా భవాని సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రోజున అమ్మవారికి చండీ రూపంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది అనంతరం వంజరి సాయికుమార్ భవాని స్వగృహంలో నవదుర్గ మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది ఉదయాన్నే గణపతి హోమం పుణ్యాహవాచనము శివునికి శతరుద్రాభిషేకంతో పాటు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది అనంతరం స్వాములందరూ భవాని నామస్మరణతో ప్రాంగణమంతా మారుమరోగించడం జరిగింది హనుమాన్ భజన



మండలి సభ్యుల ఆధ్వర్యంలో అఖండ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం నవదుర్గ మహా పడిపూజ కార్యక్రమాన్ని దేవేందర్ గౌడ్ రవీందర్ గౌడ్ గురుస్వాములు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది వచ్చిన భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ



కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గిరీశ్వర్ శర్మ మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం వల్ల సకల శుభాలు జరుగుతాయని అమ్మవారి ఆశీర్వచనము అందరిపై ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు

## జనగణన నిర్వహణలో ప్రతి ఉద్యోగి బాధ్యతగా వ్యవహరించాలి: జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న

**- ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం**

మన మీ వార్త అక్టోబర్ 14 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :

**జీడబ్ల్యూఎంసీ, అక్టోబర్ 14:** జనగణన--2027లో భాగంగా చేపట్టనున్న రెండో దశ జనాభా గణన ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించేందుకు ప్రతి ఉద్యోగి పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న సూచించారు.

హనుమకొండ జిల్లా మరియు జీడబ్ల్యూఎంసీ పరిధిలోని ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు రెండు రోజులు జీడబ్ల్యూఎంసీ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన జనగణన--2027 రెండో దశ జనాభా గణన శిక్షణ కార్యక్రమంలో చివరి రోజైన బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, జనాభా గణన దేశ అభివృద్ధి ప్రణాళికలకు కీలకమైన సమాచారాన్ని అందించే అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రక్రియ అని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, భవిష్యత్తు




అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు జనగణన గణాంకాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అందువల్ల శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ, జనాభా గణనకు సంబంధించిన సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.

ముఖ్యంగా, మొదటి దశలో చేపట్టిన హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ (హూా) ద్వారా రూపొందించిన హౌస్ లిస్టింగ్ బ్లాకులను రెండో దశలో జనాభా గణన కోసం అవసరమైన ఎన్యుమరేషన్ బ్లాకులుగా రూపొందించే ప్రక్రియపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సంబంధిత ప్రశ్నావళి, విధివిధానాలు, సాంకేతిక అంశాలపై స్పష్టతతో పనిచేయాలని



సూచించారు.

జనగణన విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, నిర్ణీత మార్గదర్శకాలను అనుసరిస్తూ సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది సిద్ధం కావాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సిటీ ప్లానర్ రవీందర్ రాడెకర్, హైదరాబాద్ జనగణన విభాగానికి చెందిన శిక్షకులు సతీష్, ప్రశాంత్ తదితరులు పాల్గొని జనాభా గణనకు సంబంధించిన విధివిధానాలు, సాంకేతిక అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు.

## రెవెన్యూ అధికారుల కళ్ళు కప్పి అక్రమ నిర్మాణాల జోరు..!

**- రెవెన్యూ అధికారులకు సవాల్ విసురుతున్న అక్రమ నిర్మాణదారులు - నిద్రావస్థలో మున్సిపల్, రెవెన్యూ యంత్రాంగం**

జవహర్ నగర్, అక్టోబర్ 14: (వార్త ప్రతినిధి)

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ భూముల కబ్జా పర్వం యథేచ్ఛగా సాగుతోంది. రెవెన్యూ అధికారుల కళ్ళు కప్పి రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా, సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**సర్వే నం. 417, 418 లో ఏం జరుగుతోంది?**

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సంతోష్ నగర్ భద్రయ్య వెంచర్ లో గల సర్వే నంబర్ 417, 418 కు చెందిన రెవెన్యూ ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాదారులు అక్రమంగా ఆక్రమించి, ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ భూమిలో



ఇప్పటికే పలు అక్రమ నిర్మాణాలు వెలిశాయి.

**గతంలో కూల్చినా మళ్ళీ అదే తీరు..**

గతంలో ఈ విషయం వెలుగులోకి రావడంతో అప్పటి ఎమ్మార్వో ఆదేశాల మేరకు అధికారులు అక్కడి అక్రమ నిర్మాణాలను తొలగించారు. అయితే అధికారులు వెళ్లిన మరుసటి రోజే మళ్ళీ అదే స్థలంలో రాత్రికి రాత్రే శ్లాబులు వేయడం, గోడలు కట్టడం వంటి పనులు షురూ చేయడంతో స్థానికులు విస్తుపోతున్నారు. ఇది అధికారులకు సవాల్ విసిరినట్లుగా ఉందని ప్రజలు అంటున్నారు.

**అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు..**

ప్రభుత్వ భూమిలో ఇంత బహిరంగంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీని వెనుక ఎవరైనా పెద్దల హస్తం ఉందా? అక్రమార్కులకు అధికారులే పరోక్షంగా సహకరిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ప్రజల డిమాండ్ ఏంటి?**

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్ స్పందించి సర్వే నం. 417, 418 లోని ప్రభుత్వ భూమికి పూర్తి స్థాయిలో సర్వే చేయించాలని, అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా ఆ భూమి ప్రభుత్వ భూమి అని తెలిపేలా శాశ్వత సూచిక బోర్డు ఏర్పాటు చేసి, చుట్టూ ఫెన్సింగ్ వేయాలని, మరల ఇలాంటి కబ్జాలు జరగకుండా చూడాలని కాలనీ వాసులు, సామాజిక వేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

## బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- చెరువుల వద్ద పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**- బతుకమ్మ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న**

మన మీ వార్త అక్టోబర్ 14 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :

**జిడబ్ల్యూఎంసీ, అక్టోబర్ 14:** బతుకమ్మ పండుగను మహిళలు, ప్రజలు ఆనందోత్సాహాలతో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.

బుధవారం నగరంలోని చిన్నవడ్డేపల్లి చెరువు, ఉర్స్ , బెస్తం చెరువు, బంధం చెరువు, పద్మాక్షిగుండం చెరువు తదితర ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకల కోసం చేపడుతున్న ఏర్పాట్లను కమిషనర్ క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సమర్థవంతంగా నిర్వహించుటకు సంబంధిత అధికారులకు కీలక సూచనలు చేశారు.

చెరువుల వద్దకు బతుకమ్మలను తీసుకువచ్చే మహిళలు, భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. బతుకమ్మ నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట్ల మార్గాలను సరిచేయడంతోపాటు, రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. చెరువుల వద్ద ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని, సంబంధిత శాఖల అధికారులను సమన్వయం





చేసుకొంటూ అవసరమైన ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. అదేవిధంగా విద్యుత్ దీపాలు, తాగునీరు, పారిశుధ్యం తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని, అన్ని ఏర్పాట్లను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

వివిధ విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ బతుకమ్మ వేడుకలు విజయవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని, చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేసి వేడుకలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈలు సంజయ్ కుమార్, రవికుమార్‌తో పాటు సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రీ-సర్వేపై అపోహలు వీడి ప్రజలు సహకరించాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద








**మన మీ వార్త అక్టోబర్ 14 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

పర్వతగిరి మండలం గోపనపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన భూముల రీ-సర్వే అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని, రీ-సర్వేపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూముల రీ-సర్వే ప్రక్రియ ద్వారా భూముల సరిహద్దులు, విస్తీర్ణం, భూ రికార్డుల కోసం వివరాల్లో స్పష్టత, పారదర్శకత పెరుగుతాయని తెలిపారు.

రీ-సర్వేపై ఎలాంటి అపోహలకు గురికాకుండా రైతులు, భూ యజమానులు ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. భూములకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, రికార్డుల్లో ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసరావు, వరంగల్ ఆర్డీవో సుమ, పర్వతగిరి తహసిల్దార్ వెంకటస్వామి, గోపనపల్లి సర్పంచ్ నాంపల్లి విజయ, అనంతరం సర్పంచ్ తోట శ్రీలత, సంబంధిత అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వరంగల్ నల్గొండ ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికల

- సన్నాహ సమావేశంలో పాల్గొన్న పగడాల

**అక్టోబర్ 14 10 2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త :**

హనంకొండ జిల్లా పరకాల : నియోజకవర్గం పరకాల రూలర్ మండల్ అధ్యక్షులు కాసగాని రాజ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వరంగల్ నల్గొండ ఖమ్మం పట్టా మంత్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహ పరకాల పట్టణ శాఖ కార్యాలయంలో నిర్వహించారు

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎంఎల్ఏ డి ఆర్ . పగడాల కాళీ ప్రసాద్ రావు హాజరయ్యారు

ఈ సందర్భంగా డా. పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన కార్యాచరణ, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, నాయకులు మరియు కార్యకర్తల బాధ్యతలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.

అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తమ పరిసర ప్రాంతాల్లో ఉన్న అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు.




పట్టభద్రుల ఓటు హక్కు ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో కీలకమని, ప్రతి అర్హుడూ తన ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.

**పట్టభద్రుల ఓటు హక్కు ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకం!**

ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్ పి జయంత్ లాల్, దేవునూరి మేఘనత్ , జిల్లా కౌన్సిల్ మెంబెర్ మాచబోయిన బాబు యాదవ్ , ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి డా. తిక్క వినోద్ కుమార్ , బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు మాచబోయిన క్రాంతి యాదవ్ , ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి తక్కళ్లపెల్లి కిరణ్,సీనియర్ నాయకులు ముస్కె సంతోష్, దయ్యాల దేవరాజ్ ,మండల ప్రధాన కార్యదర్శులు జంగిలి రాజేందర్ రావు, గుండెబోయిన నర్సయ్య ,మండల ఉపాధ్యక్షులు ఎం. సంతోష్ రావు, ఎం.ఎల్.సి ఎన్నికల మండల కన్వీనర్ ఎదునూరి లింగయ్య , కో కన్వీనర్ రసమల్ల నవీన్ , మాజీ సర్పంచ్ అడికల సురేష్ ,ఉప సర్పంచ్ కాలే సంపత్ నాయకులు కొయ్యడ రమేష్, కునూరు వీరాస్వామి,జి అది నువ్వే . శ్రీనివాసరెడ్డి,గొట్టె మొగిలి, వంగ బిక్షపతి, కె. శ్రీకాంత్, పి. రాంబాబు, పి . సంపత్, టి. మురళి, బి. శివ,జి.లింగయ్య, ఏ . సదయ్య, ఈ.కిరణ్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభం





- అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు చేసుకోవాలి - తోటకూర వజ్రేష్ యాదవ్

**బోడుప్పల్ సర్కిల్ అక్టోబర్ 14(మన మీ వార్త) :**

హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మేడిపల్లి డివిజన్ లో పీర్జాదిగూడ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ బుచ్చి యాదవ్ గారి ఆధ్వర్యంలో, చేపట్టిన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపించే నాయకత్వాన్ని ఎన్నుకోవడంలో ప్రతి పట్టభద్రుడి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. ఓటరు నమోదు ప్రక్రియను బాధ్యతగా తీసుకొని, అర్హులైన పట్టభద్రులందరూ నమోదు చేసుకునేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, మాజీ డిప్యూటీ మేయర్ శివ గౌడ్,ఉప్పల్ డిపో వర్క్ షాప్ అధ్యక్షులు దర్గా దయాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులు, మహిళా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్‌లో భారీ పెరుగుదల

- వ్యవసాయ అవసరాలు, ఏసీలు, కూలర్ల వినియోగంతో పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- నిరంతర విద్యుత్ సరఫరాకు టీజీఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక చర్యలు
- ముందస్తు ప్రణాళికతో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాలి

**మన మీ వార్త అక్టోబర్ 14 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

ములుగు సర్కిల్ పరిధిలో పలు విద్యుత్ సబ్‌స్టేషన్లు తనిఖీ చేసిన సీఎండీ ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, వ్యవసాయ విద్యుత్ వినియోగంతో పాటు ఏసీలు, కూలర్ల వాడకం పెరగడం వల్ల విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్ పేర్కొన్నారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

బుధవారం ములుగు సర్కిల్ పరిధిలో పర్యటించిన సీఎండీ కమలాపూర్‌లోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌తో పాటు మంగపేట, మల్లూరు, అబ్బాపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అనంతరం



ములుగులోని ఎస్‌పీఎం షెడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ల నిర్వహణ, విద్యుత్ పరికరాల పనితీరు, ప్రస్తుత విద్యుత్ సరఫరా పరిస్థితులను సమీక్షించారు.

రాబోయే సీజన్‌లో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు, గృహ, వాణిజ్య విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

విద్యుత్‌కు గరిష్ఠ డిమాండ్ ఉండే సమయాల్లో అంతరాయాలను తగ్గించేందుకు, సాధ్యమైన చోట్ల విద్యుత్ లైన్ క్లియరెన్స్‌లను (ఎల్‌సీ) సాయంత్రం వేళల్లోనే ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు.



11 కేవీ ఫీడర్లపై విద్యుత్ అంతరాయాలు ఏర్పడినప్పుడు సంబంధిత సిబ్బంది వెంటనే స్పందించి లోపాలను గుర్తించి, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనవసరంగా లైన్ క్లియరెన్స్‌లు తీసుకోకూడదని సూచించారు . క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను (డీటీఆర్) తక్షణమే మార్చి, విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా పంటలకు నష్టం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఈ పర్యటనలో సీఎండీ వెంట ములుగు సర్కిల్ ఎస్‌ఈ బిక్షపతి, ములుగు డీఈ రాజు, ఏటూరునాగారం ఏడీఈతో పాటు ఇతర విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## వ్యస్టన్ హబ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు

**14 ,10. 2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త :**



హనంకొండ జిల్లా పరకాల పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యస్టన్ హబ్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రిబ్బన్ కట్ చేసి షాప్‌ను ప్రారంభించారు. అనంతరం వ్యస్టన్ హబ్ యాజమాన్యానికి శు భాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్, వార్డు కౌన్సిలర్లు ఆకుల శ్రీధర్, లావణ్య, కుక్కల విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంతి లాల్, జిల్లా కార్యదర్శి ఎర్రం రామన్న, పిట్టా కిషోర్, కులనోపాక రేవంత్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మహిళా సమైక్య భవనాలను పరిశీలించిన శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి

**అక్టోబర్ 14 10 2026 :**



హనంకొండ జిల్లా నడికూడ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (హెచ్ సి) భవనం మరియు మహిళా సమైక్య భవనాలను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. అనంతరం భవనాల నిర్మాణ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నడికూడ మండల సమీప ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారుప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మహిళా సమైక్య భవనాలను పరిశీలించారు.

## నడికుడ మండల బీజేవైఎం అధ్యక్షునిగా ఎరుకల దివాకర్

**పరకాల ప్రతినిధి మన మీ వార్త అక్టోబర్ 14 :**



హనంకొండ జిల్లా నడికుడ మండల బి జె వై ఎం అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పగడాల కాళీ ప్రసాద్ , శ్రీమతి రావు పద్మ , హనుమకొండ జిల్లా బి జె వై ఎం అధ్యక్షులు, నా ఆత్మీయ మిత్రుడు పున్నం వేణు , హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ కోలాను సంతోష్ రెడ్డి , నడికుడ మండల బీజేపీ అధ్యక్షులు, నా మిత్రుడు ఎరుకల దివాకర్ నా హృదయపూర్వక కృతజ్ఞతలు

నాకు అప్పగించిన ఈ బాధ్యతను ఒక పదవిగా కాదు... ప్రజలకు సేవ చేసే పవిత్రమైన అవకాశంగా భావిస్తున్నాను.

భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, దేశభక్తి స్ఫూర్తితో యువతను ఏకం చేస్తూ, కార్యకర్తలతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను.

నడికుడ మండలంలోని ప్రతి గ్రామంలో యువతకు అండగా నిలుస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, ప్రజాసేవే పరమావధిగా ముందుకు సాగుతాను.

నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం నా మొదటి బాధ్యత.
కార్యకర్తల గౌరవాన్ని కాపాడటం నా కర్తవ్యం.
పార్టీని బలోపేతం చేయడం నా లక్ష్యం.
ప్రజల కోసం పనిచేయడం నా ధ్యేయం.
మీ ఆశీస్సులు...
మీ మార్గదర్శకత్వం...
కార్యకర్తల సహకారం...
నా బలం -- నా బాధ్యత నా విజయపథం.

నడికుడ మండల యువత గొంతుకగా, కార్యకర్తల సహచరుడిగా, ప్రజల సేవకుడిగా నిరంతరం మీ మధ్య ఉంటూ పనిచేస్తానని హామీ ఇస్తున్నాను.

## బాలికపై లైంగిక దాడి.. నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష

**అక్టోబర్ 14 మన మీ వార్తా ప్రతినిధి వెల్దుర్తి :**




బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు తీర్పునిచ్చినట్లుజిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. వెల్దుర్తి మండలం చేరిలా గ్రామానికి చెందినఇక్కిరి శ్రీశైలం ఆటో నడుపుతూ ప్లంబర్ గా పనిచేస్తూ జీవనం జీవనం సాగిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు . మెల్లూరు నుంచి తూప్రాన్‌కు ఆటో నడుపుతున్న సమయంలో కళాశాలకు వెళ్లేందుకు వేచి ఉన్న 17 ఏళ్ల బాలికను ఆటోలోఎక్కించుకొని ప్రేమిస్తున్నానని నమ్మబలికి బాలిక నిరాకరించినప్పటికీ బలవంతంగా తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడాలని నిందితుడు పథకం వేసినట్లు ఎస్పీ తెలిపారు ఈ సంఘటన.16 ఏప్రిల్.2021న బాలిక కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లిన సమయంలో ఆమె ఇంటి వద్దకు వెళ్లి బైక్ ఎక్కాలని బలవంతం చేశాడు. బాలిక నిరాకరించడంతో కత్తితో బెదిరించి, బాసర, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక తండ్రికి ఫోన్ చేసి తూప్రాన్‌లో ఉన్నట్లు సమాచారం ఇచ్చాడు. దీంతో తండ్రి బాలికను ఇంటికి తీసుకెళ్లాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 27 ఏప్రిల్.2021న ఎల్దుర్తి ఎస్ఐ మహేందర్ కేసు నమోదు చేశారు. అప్పటి తూప్రాన్ డీఎస్పీ కిరణ్ కుమార్ దర్యాప్తు నిర్వహించి అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య కోర్టులో బలమైన వాదనలు వినిపించారు. దీంతో ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభవాలి నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో ఎస్ఐ కరుణాకర్ రెడ్డి, కోర్టు లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ గౌడ్, సీడీఓ ప్రవీణ్ సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా సమన్వయంతో పనిచేసిన అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# ములుగు జిల్లా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

**- ఈ నెల 15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు**

**- ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి**

**మన మీ వార్త అక్టోబర్ 14 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి సూచించారు. బుధవారం ములుగు ఆర్డీవో కార్యాలయంలోని తన ఛాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026, వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియలపై చర్చించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులు, ముఖ్యంగా 18 నుంచి 19 ఏళ్ల యువత ఓటరు నమోదుకు ముందుకు రావాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ఈ అవకాశాన్ని





సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీల బూత్‌స్థాయి ఏజెంట్లు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడాలని సూచించారు.
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా అనుసంధానం కాని ఓటర్ల వివరాలు, అసంగతతలున్న నమోదులకు సంబంధించి 41,900 నోటీసులు రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 41,764 నోటీసులను అందజేశామని, మిగిలిన నోటీసులను రాబోయే వారం పది రోజుల్లో అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆగస్టు 17న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాపై అక్టోబర్ 7 వరకు దరఖాస్తులు, అభ్యంతరాలు స్వీకరించినట్లు వివరించారు. ఫారం--6 ద్వారా 748, ఫారం--7 ద్వారా 13, ఫారం--8 ద్వారా 803 దరఖాస్తులు అందాయని తెలిపారు. వీటిపై విచారణ చేపట్టి, అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించిన అర్హుల దరఖాస్తులను ఆమోదించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు చెప్పారు. అందిన దరఖాస్తులు, అభ్యంతరాల జాబితాలను సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు.

పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటరు నమోదుకు సంబంధించి ఫారం--18 ద్వారా అంతర్జాలంలో 4,186 దరఖాస్తులు, నేరుగా 6 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అంతర్జాలంలో అందిన దరఖాస్తుల్లో 47 దరఖాస్తులను ఆమోదించామని, మిగిలిన వాటిని నిర్ణీత సమయంలో విచారించి తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఓటర్ల జాబితా ప్రక్రియపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.

ఈ సమావేశంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్లు గణపతి, నితీష్, సంబంధిత సిబ్బంది, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలి








**- ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నేతల హెచ్చరిక !**

**- రాష్ట్ర ఎన్నికల కమిషన్ ముట్టడి, తోపులాటలు, అరెస్టులు !**

**హైదరాబాద్ అక్టోబర్ 14 (మన మీ వార్త):**

ప్రజాస్వామ్య పరిరక్షకులైన మోదీ, షా, జ్ఞానేష్ ఓటు చోరీ తో దేశద్రోహ చర్యలకు పాల్పడ్డారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మర్రి శ్రీమాన్, నేర్లేకంటి శ్రీకాంత్ ఆరోపించారు. ఎస్ఐఆర్ ను రద్దు చేసి, సిఈసి జ్ఞానేష్ కుమార్ తక్షణమే అభిశంసించలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్), అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) సంయుక్తాధ్వర్యంలో బుధవారం హైదరాబాద్, లిబర్టీ నుండి బి.ఆర్.కె భవన్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ శ్రేణులు జండాలు, ప్లకార్డులు చేతబూని సర్ ను తక్షణమే రద్దు చేయాలి, "జ్ఞానీ చోర్", ఓటు చోరీ పై మోదీ జవాబు చెప్పాలి, "ఓట్ల దొంగ, పదవి నుంచి తప్పుకో", "జ్ఞానేష్ కుమార్, దిగిపో" అని నినాదాలు చేస్తూ బారికేడ్ లను ఛేదించుకొని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయాన్ని ఒక్కసారిగా ముట్టడించారు. ఈ సందర్భంగా పోలీసులు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ శ్రేణుల మధ్య తోపులాటలు జరిగి ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అనంతరం పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్ లకు తరలించారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేయడంతో భారతదేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిపోయిందని, పేదల ఓటు హక్కును నిరాకరించడానికి వ్యవస్థీకృతంగా ఎస్ఐఆర్ పేరుతో జరుగుతున్న దొంగతనం అని తెలిపారు. సామాన్య ప్రజలకు ఓటు హక్కు మరియు ప్రభుత్వాన్ని మార్చే అధికారం ఉండకూడదని దురుద్దేశంతోనే "జ్ఞానీ చోర్" తోకలసి మోదీషా కుట్రలు పన్ని ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, వీరి దుర్మార్గమైన ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు. దేశాన్ని రక్షించే వారే ఓటు దొంగలైతే దేశం అధోగతి పాలవుతుందని, పేదల ఓటు హక్కును హరిస్తే ఉరుకునేదిలేదని, తెల్లవాళ్లతో పోరాడాం, దేశ ఓటు దొంగలతో పోరాడతాం అని తెలిపారు. తక్షణమే ఎస్ఐఆర్ పక్రియను అపి, సిఈసి జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని డిమాండ్ చేసారు. మర్రి శ్రీమాన్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్రాలు ఓట్ల దొంగతనం ద్వారా ఏర్పడిన అక్రమ ప్రభుత్వాలని, ఈ ఓట్ల దొంగతనం వెనుక జ్ఞానేష్ కుమార్ ప్రధాన సూత్రధారి అని ఆరోపించారు. బీజేపీ ఎన్నికల సంఘాన్ని కాపాడుతోంది, ఎన్నికల సంఘం బీజేపీని కాపాడుతోందని అని తెలిపారు. ఎన్నికల అవకతవకలపై ప్రతిపక్షాల ఆరోపణలపై ప్రధాని మోదీ కి సమాధానం ఇచ్చే ధైర్యం గానీ, సత్తా గానీ లేదన్నారు. దేశంలో ఓట్ల దొంగతనం అత్యంత తీవ్రమైన నేరం తామే చేశామని ఒప్పుకొని మోదీ, షా, జ్ఞానీ గద్దె దిగాలని డిమాండ్ చేసారు. భారత ప్రజల హక్కులను, ముఖ్యంగా ఓటు వేసే ఈ ప్రాథమిక హక్కును రక్షించేందుకు గల్లీ నుండి ఢిల్లీ వరకు విద్యార్థి, యువజనులను ఏకం చేసి బలమైన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. నేర్లేకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ, దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకొని, విద్యా వ్యవస్థ, ఉపాధిని నాశనం చేసి, ఇప్పుడు బీజేపీ కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని అంటిపెట్టుకుని ప్రజల ఓటు హక్కును నిర్వీర్యం చేసి ప్రజాస్వామ్యాన్ని ఖుని చేసేందుకు ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. ఓట్ల చోరీ దేశానికి ప్రమాదకరమని, ఎస్ఐఆర్ ను తక్షణమే అపి, బీజేపీ ఏజెంట్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే అభిశంసించలని లేని పక్షంలో ఎన్నికల వ్యవస్థ, రాజ్యాంగం, ప్రజాస్వామ్య రక్షణకై మిలిటెంట్ పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ టీ. సత్యప్రసాద్, పి. శివకుమార్, ఏఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు జి. నరేష్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఎస్. వంశీ వర్ధన్, లెనిన్, నెల్లి సత్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు షేక్ మహమూద్, సల్మాన్ బేగ్, టి. మధు, కే కళ్యాణ్, మహేష్, భగత్ సింగ్, గణేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం. చైతన్య యాదవ్, మహమ్మద్ అన్వర్, పవన్ కళ్యాణ్, ఆకాష్, జోసెఫ్ భాను, ఆంజనేయులు, మహేష్, శివ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.2 లక్షలు ఇవ్వలేదని భవనం కూల్చివేశారంటూ ఫిర్యాదు

**- డబ్బులు డిమాండ్ చేశారంటూ అధికార పార్టీ నాయకుడు రాజుచారిపై ఆరోపణలు**

**మీ వార్త / కుత్బుల్లాపూర్ :**



ఇంటి నిర్మాణం ఓ వివాదానికి దారితీసింది. భవన నిర్మాణం విషయంలో రూ.2 లక్షలు ఇవ్వాలని అధికార పార్టీ నాయకుడు రాజుచారి డిమాండ్ చేశారని, తాను అడిగిన మొత్తం చెల్లించకపోవడంతో సీఎంసీ అధికారులతో తన భవనాన్ని కూల్చివేయించారని భవానీనగర్‌కు చెందిన ఇంటి యజమాని నర్సింహులు ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించి బుధవారం సూరారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి నిర్మాణం చేపడుతున్న సమయంలో రాజుచారి తనను రూ.2 లక్షలు ఇవ్వాలని కోరినట్లు ఆరోపించారు. తాను డబ్బులు చెల్లించకపోవడంతో తనపై ఒత్తిడి తీసుకొచ్చారని, అనంతరం సీఎంసీ అధికారులతో తన భవనాన్ని కూల్చివేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తన వద్ద ఉన్న ఆధారాలను సైతం పోలీసులకు సమర్పించినట్లు తెలిపారు. తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. భవన నిర్మాణం, కూల్చివేతకు దారితీసిన పరిస్థితులు, డబ్బుల డిమాండ్ ఆరోపణలపై విచారణ చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా ఈ వ్యవహారంలో పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## భార్యపై సుత్తితో దాడి... భర్త అరెస్ట్

**బోడుప్పల్ సర్కిల్ అక్టోబర్ 14 (మన మీ వార్త):**



మద్యం మత్తులో భార్యతో గొడవపడి ఆమె నిద్రిస్తున్న సమయంలో సుత్తితో తలపై పలుమార్లు కొట్టి తీవ్రంగా గాయపరిచిన భర్తను మేడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్వతాపూర్, గాంధీనగర్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పర్వతాపూర్ కు చెందిన ఘౌస్ పాషా ఖురేషీ కి (42) ,2021 లో జైబున్ బేగం (28)తో రెండో వివాహం జరిగింది. అప్పటి నుంచి మద్యం సేవించి తరచూ భార్యతో గొడవ పడుతూ మానసికంగా శారీరకంగా వేధించేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో అక్టోబర్ 10వ తేదీ రాత్రి కూడా మద్యం సేవించి భార్యతో గొడవకు దిగాడు. కుటుంబ సభ్యులైన కుమారులు జోక్యం చేసుకొని గొడవను సద్దుమణిగించారు. మరుసటి రోజు అక్టోబర్ 11వ తేదీ తెల్లవారు జామున సుమారు 3 గంటల సమయంలో వేరే గదిలో నిద్రిస్తున్న జైబున్ బేగంపై నిందితుడు సుత్తితో పలుమార్లు దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే కుమారులు ఆమెను హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది, ఈ ఘటనపై బాధితురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు వేధింపులు హత్యాయత్నానికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా అక్టోబర్ 14న ఘౌస్ పాషా ఖురేషీని అరెస్టు చేశారు. దాడికి ఉపయోగించిన సుత్తిని పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని మేడిపల్లి ఇన్స్పెక్టర్ జలంధర్ రెడ్డి తెలిపారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**అక్టోబర్ 14 పరకాల ప్రతినిధి మన మీ వార్త :**



హనంకొండ జిల్లా పరకాల పట్టణ కేంద్రంలోని రాజుపేట లో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు మేమే చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగ అభివృద్ధిక ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఈ పాఠశాల ద్వారా స్థానిక విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా,సమయానికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు.

## సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**అక్టోబర్ 14 10 2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త :**



హనంకొండ జిల్లా పరకాల పట్టణ కేంద్రంలోని గొర్ల అంగడి మైదానంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకలకు హాజరయ్యే మహిళలు, ఆడపడుచులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే దామెర చెరువు వద్ద నిర్వహించనున్న బతుకమ్మ నిమర్జన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, ఆడపడుచులు ఆనందోత్సాహాల మధ్య ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. మహిళా సోదరీమణులకు స్వాగతం పలికేలా హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని,మైదానంలో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు,తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

## జనగామపట్టభద్రుల ఎమ్మెల్సీ కొత్త ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్

**మన మీ వార్త అక్టోబర్ 14 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ కొత్త ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదలైనట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సందీప్ కుమార్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.
2026 నవంబర్ 1ని అర్హత తేదీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.
01-11-2026 నాటికి కనీసం 3 సంవత్సరాల క్రితం డిగ్రీ పూర్తి చేసిన అర్హత కలిగిన అభ్యర్థులు ఫీశీతీఎ-18 దరఖాస్తును ాజు=ాలకు (లేదా) నియమిత అధికారికి సమర్పించాలన్నారు.
నవంబర్ 6 వరకు ఫారం-18 దరఖాస్తులు స్వీకరిస్తారు.
నవంబర్ 20 వరకు ముసాయిదా జాబితా తయారీ, ముద్రణ ప్రక్రియ పూర్తి చేసి, నవంబర్ 25న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు.
అదే రోజు నుంచి డిసెంబర్ 10 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారు.
డిసెంబర్ 25లోగా వాటిని పరిష్కరించి, సప్లిమెంట్లను సిద్ధం చేస్తారు.
డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు.

## పేదోడి సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం





**శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (14):**

శివ్వంపేట మండలం బిజిలి పూర్ గ్రామంలో పూర్తయిన ఇళ్లను బుధవారం కాంగ్రెస్ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచి,వారికి గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు.

ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించడం ద్వారా వారి జీవితాల్లో భరోసా నింపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పేదల సంక్షేమం,సామాజిక న్యాయం,ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవంతో కూడిన జీవనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నాయకులు తెలిపారు. పేదల సొంతింటి కల సాకారమైతే వారి కుటుంబాలకు భద్రతతో పాటు భవిష్యత్తుపై నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోదావరిఖనికి తరలిన కాసిపేట మండల బీఆర్ఎస్ శ్రేణులు

**కాసిపేట, అక్టోబర్ 14 (మన మీ వార్త మండల ప్రతినిధి) :**



బుధవారం గోదావరిఖనిలో నిర్వహించిన 'చలో గోదావరిఖని -- సింగరేణి కార్మికుల గర్జన' భారీ బహిరంగ సభకు కాసిపేట మండల బీఆర్ఎస్ శ్రేణులు తరలి వెళ్లారు. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ సభకు బయలుదేరారు.

# హనుమకొండ పువ్వులను దేవతలుగా పూజించే పండుగ బతుకమ్మ





- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేనాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉద్యోగ సంఘాల నేతృత్వంలో బతుకమ్మ వేడుకలు

**మన మీ వార్త అక్టోబర్ 14 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

బతుకమ్మ సంబురాలు హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి.

వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన మహిళా ఉద్యోగినిలు పెద్ద సంఖ్యలో హాజరై తీరోక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పండుగ వేడుకలు అత్యంత వైభోపేతంగా,మహిళల బతుకమ్మ ఆటపాటలతో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, ఎన్పీడీసీఎల్ సిఎమ్ డి వరుణ్ రెడ్డి, అదనపు కలెక్టర్ రవి(రెవెన్యూ), శేషాద్రి( స్థానిక సంస్థలు), ఎమ్మెల్యే సతీమణి నాయిని నీలిమ రాజేందర్ రెడ్డి హాజరైనారు. మహిళా ఉద్యోగులతో కలిసి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, ఎమ్మెల్యే సతీమణి నాయిని నీలిమా రాజేందర్ రెడ్డి బతుకమ్మ ఆటపాటలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని, ఈ వవిశిష్టమైన సాంస్కృతిక వారసత్వంను భావితరాలకు అందించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా అత్యంత వైభవంగా హనుమకొండ కలెక్టరేట్లో బతుకమ్మ వేడుకలు ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుతున్నరని పేర్కొంటూ జిల్లాలోని అధికారులకు, ఉద్యోగులకు సద్దుల బతుకమ్మ, దసరా పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ మహిళలను శక్తి రూపంగా పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజలదని పువ్వులని దేవుళు ƒగా పూజించే పండుగ ప్రపంచంలో ఒక బతుకమ్మ పండుగ మాత్రమే అని పేర్కొన్నారు. జిల్లాలోని మహిళా ఉద్యోగినులతో కలిసి బతుకమ్మ పండుగ వేడుకల్లో పాల్గొనడం చాలా ఆనందాన్ని కలిగిస్తున్నదని పేర్కొన్నారు.అన్నీ బతుకమ్మ లు చాలా బాగున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లాలోని ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు, ప్రజలకు సద్దుల బతుకమ్మ, దసరా పండుగల శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎన్పీడీసీఎల్ సిఎమ్ డి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా లోని అధికారులకు, ఉద్యోగులకు, ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు

ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ మాట్లాడుతూ మహిళా శక్తికి ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని పేర్కొంటూ ప్రతి సంవత్సరం కలెక్టరేట్లో బతుకమ్మ వేడుకలను అత్యంత ఘనంగా ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాము అని అందుకు సహకరిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు ,ఉద్యోగ సంఘాల నేతలకు, ఉద్యోగులకు ఉద్యోగ సంఘాల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ సాంప్రదాయం తెలిపే పండుగలను ఉద్యోగ సంఘాల నేతృత్వంలో జరుపుకోవడం అత్యంత ఆనందకరం అని పేర్కొంటూ కలెక్టర్ గారి నేతృత్వంలో జిల్లాను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు ఆకవరపు శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడే విధంగా బతుకమ్మ పండుగ వేడుకలు కలెక్టరేట్లో ఘనంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా అత్యంత తీరోక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేయడం జరిగినది. డిఆర్డిఏ మొదటి బహుమతి, ,రెండవ బహుమతి ఐ సి డి ఎస్, మూడవ బహుమతి కలెక్టరేట్ రెవెన్యూ, స్పెషల్ ప్రైజ్ కాకతీయ మెడికల్ కాలేజ్ లకు లభించాయి. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ శ్రీనివాస్ డి ఎం హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య, సి పి ఓ సత్యనారాయణ రెడ్డి ,ఉద్యోగ సంఘాల నేతలు బైరి సోమయ్య, పుల్లూరు వేణుగోపాల్,పనికల రాజేష్,జగన్ మోహన్ రెడ్డి, డాక్టర్ ప్రవీణ్, శ్యాంసుందర్ ,మాధవరెడ్డి, రాము నాయక్,శ్రీనివాస్ రెడ్డి, జయంతి,శ్రీలత, నాగరాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నాచారం పటేల్ కుంట చెరువు సుందరీకరణకు త్వరలో చర్యలు

- 2.5 ఎంఎల్డీ సామర్థ్యంతో మురుగునీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు.. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేడల మల్లికార్జున్ గౌడ్

**నాచారం, అక్టోబర్ 14 ( మన మీ వార్త):**




నాచారం ఎర్రకుంటలోని పటేల్ కుంట చెరువును అతి త్వరలో సుందరీకరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేడల మల్లికార్జున్ గౌడ్ తెలిపారు. చెరువులోకి ఇతర ప్రాంతాల నుంచి మురుగునీరు, వ్యర్థాలు చేరకుండా ప్రత్యేకంగా పైపులైన్ వ్యవస్థను ఏర్పాటు చేసి, వ్యర్థజలాలు చెరువులో కలవకుండా మళ్లించే చర్యలు చేపట్టినట్లు వివరించారు.

రానున్న రోజుల్లో నాచారం ప్రాంతాన్ని దోమల బెడద లేని ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా 2.5 ఎంఎల్డీ సామర్థ్యంతో కూడిన మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ) ద్వారా వ్యర్థజలాలను శుద్ధి చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ చర్యలతో చెరువు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన పర్యావరణాన్ని అందించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.నాచారం డివిజన్ ప్రజల తరఫున ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి మేడల మల్లికార్జున్ గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చెరువు అభివృద్ధి, మురుగునీటి సమస్య పరిష్కారానికి ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు టేకులపల్లి రామచందర్, మంగోల్ శివకుమార్, సుంచు వాసు, గొల్లూరి ప్రభాకర్, యూసుఫ్, కాసగోని మల్లికార్జున్ గౌడ్, మ్యాగ్నెట్ మల్లేష్, పూల సాయి, తండ ఈశ్వర్, కాసుల అనిల్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలగిరి చౌరస్తా ఫ్లైఓవర్‌పై భిన్నాభిప్రాయాలు




- వ్యాపారాలు దెబ్బతింటాయంటున్న యజమానులు..
- బైపాస్ లేదా జంక్షన్ సిగ్నల్స్ కోసం డిమాండ్
- ప్రాణాలతో చెలగాటం వద్దు.. ఫ్లైఓవర్ నిర్మాణం అత్యవసరమంటున్న స్థానికులు, వాహనదారులు

**అక్టోబర్14(మన మీ వార్త తుంగతుర్తి ప్రతినిధి) :**

**తిరుమలగిరి:** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ప్రతిపాదించిన ఫ్లైఓవర్ నిర్మాణం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాజెక్టుపై అటు వ్యాపారులు, ఇటు స్థానిక ప్రజల నుండి భిన్నమైన డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. చౌరస్తాలో ఫ్లైఓవర్ నిర్మించవద్దంటూ కమర్షియల్ బిల్డింగ్ యజమానులు, వ్యాపారులు, పలువురు రాజకీయ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల ఇక్కడి వ్యాపారాలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. చౌరస్తాలో ప్రమాదాల నివారణకు కేవలం జంక్షన్ వ్యవస్థతో కూడిన ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని, లేదంటే పట్టణానికి వెలుపల నుండి బైపాస్ రహదారిని నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సతీష్, కందుకూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**ఫ్లైఓవర్ లేకుంటే ప్రాణాలకే ముప్పు:**

స్థానికులు, వాహనదారులు మరోవైపు వ్యాపారుల డిమాండ్‌ను స్థానిక ప్రజలు, రవాణా వాహన యజమానులు, పాదచారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వలిగొండ నుండి తొర్రూరు వెళ్లే జాతీయ రహదారి తిరుమలగిరి మండల కేంద్రం గుండా వెళ్తుండటం, అలాగే నాలుగు జిల్లాల సరిహద్దు కావడంతో ఈ చౌరస్తాలో భారీ వాహనాల రద్దీ విపరీతంగా ఉంటోందని వారు గుర్తు చేస్తున్నారు. నిత్యం పక్క గ్రామాల నుండి వేలాది మంది ప్రజలు తమ అవసరాల కోసం ఇక్కడికి వస్తుంటారని, ప్రస్తుతం రోడ్డు దాటాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఫ్లైఓవర్ నిర్మించకుండా కేవలం బైపాస్ రోడ్డు వేస్తే తిరుమలగిరి మండలం, మున్సిపాలిటీ అభివృద్ధి పరంగా పూర్తిగా నష్టపోతుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఫ్లైఓవర్ నిర్మిస్తేనే ప్రమాదాలు తగ్గి వాహనదారులకు, కాలినడకన వెళ్లేవారికి శాశ్వత ప్రాణరక్షణ లభిస్తుందని స్పష్టం చేశారు. కేవలం కొంతమంది వ్యాపారుల స్వార్థం కోసం ఫ్లైఓవర్ ఆపితే, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడినట్లే అవుతుందని హెచ్చరించారు. అందరికీ మేలు జరిగేలా ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించడమే ఉత్తమమని స్థానిక ప్రజలు, వాహనదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## పంట ఎండిపోతుందనే మనోవేదనతో రైతు ఆత్మహత్య

**శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ 14:**



వ్యవసాయ పొలంలో మోటారు మరమ్మతుల సమయంలో తలెత్తిన సమస్యతో వరి పంట ఎండిపోతుందేమోనన్న ఆందోళనకు గురైన ఓ రైతు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని శంకర్ తండాలో చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమ్లా తండా పంచాయితీ పరిధిలోని శంకర్ తండాకు చెందిన మాలోత్ శంకర్ (48) ఖరీఫ్ సీజన్‌లో తనకున్న రెండు ఎకరాల్లో వరి సాగు చేశాడు.ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉండగా, నాలుగు రోజుల క్రితం వ్యవసాయ బోరు మోటారు పనిచేయకపోవడంతో మరమ్మతుల నిమిత్తం దానిని పైకి తీస్తుండగా మోటారు గుంతలో జారిపడింది.దీంతో పొలానికి నీరు అందక వరి పంట ఎండిపోతుందేమోనని శంకర్ తీవ్ర మనోవేదనకు గురైనట్లు తెలిసింది.

ఈ నెల 13వ తేదీ సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో పొలం వద్ద దిగులుగా ఉన్న శంకర్ రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు.దీంతో ఆందోళనకు గురైన కుటుంబం ఆయన చిన్న తమ్ముడు జగన్ మరుసటి రోజు 14న ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా,అక్కడ చెట్టుకు ఉరివేసుకుని శంకర్ మృతి చెంది కనిపించాడు.వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు.

కుటుంబ సభ్యులు మృతదేహాన్ని కిందికి దించి, పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి మాలోత్ భీమ్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు.

## మినీ స్టేడియం కై స్థల పరిశీలన.

- జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి రమేష్

**తూప్రాన్ / మనోహరాబాద్ సెప్టెంబర్ 14 ( మన మీ వార్త ప్రతినిధి) :**



తూప్రాన్ పట్టణంలో మినీ స్టేడియం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి రమేష్ గంగాల సందర్శించి పరిశీలించారు.

తూప్రాన్ రెవెన్యూ డివిజనల్ అధికారి బావయ్యతో సమావేశంలోమినీ స్టేడియం నిర్మాణానికి సంబంధించిన స్థలం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డబుల్ బెడ్ రూమ్ కాలనీ దగ్గరలో మినీ స్టేడియం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలో క్రీడల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు సమకూర్చడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సర్వే నంబర్ 325 లో 4.20 ఎకరాలలో మినీ స్టేడియం నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ జరుగుతుందని తెలిపారు. స్టేడియం నిర్మాణం జరిగితే ఈ ప్రాంత క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. క్రీడారంగంలో జిల్లా రాష్ట్రంలో ముందు వరుసలో ఉండేలా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ సహాయ సహకారాలు, సూచనలు, సలహాలతో ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రామాయంపేట పట్టణంలో కూడా మినీ స్టేడియం నిర్మాణానికి స్థల సేకరణ జరగాల్సి ఉందన్నారు. నర్సాపూర్ పట్టణ పరిధిలో రూపాయలు 2.65 కోట్ల నిధులతో మినీ స్టేడియం నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ ప్రారంభ దశలో ఉందని డి.వై.యస్.ఓ. రమేష్ గంగాల అన్నారు.

## జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోక్సో కేసులో 3 ఏళ్ల జైలు శిక్ష

**జవహర్ నగర్, అక్టోబర్ 14: (వార్త ప్రతినిధి)**



జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2018లో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి మేడ్చల్ కోర్టు 3 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది.

**కేసు వివరాలు:**

క్రైమ్ నంబర్ 178/2018, సెక్షన్లు 354, 448 IPC సెక్షన్ 8 పోక్సో చట్టం 2012 -SC నం. 152/20 కింద నమోదైన కేసులో ఈరోజు అనగా 14.10.2026 నాడు మేడ్చల్ జిల్లా ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి ఫర్ రేప్ అండ్ పోక్సో కేసుల కోర్టు నిందితుడిని దోషిగా తేల్చింది.

**నిందితుడి వివరాలు:**

కలశెట్టి దినేష్ కుమార్, తండ్రి రాజు, వయస్సు 20 సం., వృత్తి ఎలక్ట్రీషియన్, నివాసం హెచ్.నం. 16-95/15/14/1, సంతోష్ నగర్, బాలాజీ నగర్, కాప్రా, మేడ్చల్ జిల్లా.

**కోర్టు తీర్పు:**

గౌరవ న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధించింది.
- 448 IPC కింద: జైలు శిక్ష మరియు రూ. 1,000/- జరిమానా
- 354 IPC కింద: జైలు శిక్ష మరియు రూ. 1,000/- జరిమానా - లి2 సంవత్సరాల జైలు శిక్ష
- 7 r/w 8 పోక్సో చట్టం కింది జైలు శిక్ష మరియు రూ. 2,000/- జరిమానా
- 3 సంవత్సరాల జైలు శిక్ష
- బాధితురాలికి రూ. 50,000/- నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

## వెలిశాల గ్రామంలో పోలీస్ ప్రజా భరోసా

**అక్టోబర్14(మన మీవార్త తుంగతుర్తి ప్రతినిధి) :**




తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలో గ్రామ సర్పంచ్ కుంభం మంజుల సతీష్ గౌడ్. ఆధ్వర్యంలో పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం నిర్వహించడం జరిగింది

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తిరుమలగిరి ఎస్ఐ గుత్త వెంకట్ రెడ్డి పాల్గొని గ్రామ ప్రజలకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా గ్రామంలో బెల్ట్ షాపులు మూసివేయాలని, అక్రమంగా మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. రాబోయే దసరా పండుగను గ్రామ ప్రజలందరూ ప్రశాంతమైన వాతావరణంలో, సోదరభావంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

# వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు






**- ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి**

**మన మీ వార్త అక్టోబర్ 14 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

వరంగల్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో బుధవారం బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. టీఎన్జీవోస్, టీజీవో, ట్రెస్సా, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగినులు రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. కలెక్టరేట్ ప్రాంగణం బతుకమ్మ పాటలు, ఆటపాటలతో సందడిగా మారింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ప్రకృతిలో సహజంగా లభించే పూలను దేవతగా పూజిస్తూ తొమ్మిది రోజులపాటు బతుకమ్మ ఉత్సవాలను జరుపుకోవడం తెలంగాణ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఈ పండుగ మహిళల మధ్య ప్రేమ, స్నేహం, ఆప్యాయత, బంధుత్వాలను మరింత బలోపేతం



చేస్తుందని తెలిపారు. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే మహిళా ఉద్యోగినులు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమని అన్నారు.

ఈ బతుకమ్మ వేడుకలో స్వయంగా పాటలు పాడిన వారికి కలెక్టర్ బహుమతులు ప్రకటించారు.

ఉత్తమ బతుకమ్మ మొదటి బహుమతి ఎతీసశీ ,రెండవ బహుమతి కలెక్టరేట్,మూడవ బహుమతి స్త్రీ శిశు సంక్షేమ శాఖ కి మూడవ బహుమతికి ఎంపిక కాగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయడం జరిగింది.

జిల్లా టీజీఈజాక్ చైర్మన్, టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షుడు గాజె వేణుగోపాల్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. అన్ని శాఖల మహిళా ఉద్యోగినులు ఉత్సాహంగా పాల్గొన్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, అందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణలోని వివిధ వర్గాల ప్రజలకు ఉపాధి కల్పిస్తూ, రాష్ట్ర ప్రత్యేకతను చాటిచెబుతోందని పేర్కొన్నారు.

టీజీవో అధ్యక్షుడు ఫణికుమార్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ అస్తిత్వానికి, మహిళల ఐక్యతకు ప్రతీక అని అన్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా ఉత్సవాల్లో పాల్గొని, చివరి రోజు సద్దుల బతుకమ్మను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. మహిళా ఉద్యోగులందరికీ శుభం కలగాలని కోరుకున్నారు. కలెక్టరేట్ బతుకమ్మ సంబరాల తో ఆడపడుచుల ఆట పాటలతో కళకళలాడింది..

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమా, ఉమారాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, జెడ్పీ సీఈవో వసంత, డీపీవో కల్పన, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బాలాజీ, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం, ట్రెస్సా జిల్లా అధ్యక్షుడు గణిపాక రాజ్ కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రియాజుద్దీన్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాంబయ్య, కార్యదర్శి భాను, టీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షులు గద్దెల రాజు, ఇంద్రసేనారెడ్డి, భక బత్తిని రామదేవి తదితరులు పాల్గొన్నారు.

# బాలికలు తమ హక్కులు, రక్షణపై అవగాహన కలిగి ఉండాలి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా, ఐపీఎస్

**మన మీ వార్త అక్టోబర్ 14 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు హనుమకొండలోని బాలసముద్రం లోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన సంఘమిత్ర కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా బాలికా సంఘాలకు అవగాహన సదస్సు లో జిల్లా షీ టీమ్స్ ఆధ్వర్యంలో జిల్లాలోని బాలికా సంఘాలకు మహిళా రక్షణ, భద్రత, వ్యక్తిగత అభివృద్ధి, సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గారు మాట్లాడుతూ సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో స్నేహం చేయవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని, సైబర్ వేధింపులకు గురైతే భయపడకుండా వెంటనే తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం అందించాలని, బాలికలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని,పోలీస్ కమిషనర్ శ్వేతా గారు పేర్కొన్నారు. అలాగే సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉంటూ, సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అవసరమైన సమయంలో షీ టీమ్స్ సహాయం పొందాలని పేర్కొన్నారు.

బాలికల భద్రత, సాధికారత, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండి, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ సురక్షితమైన భవిష్యత్తు దిశగా ముందుకు సాగాలని వరంగల్ పోలీస్ కమిషనర్, సూచించారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ, వరంగల్ జిల్లాలో 467 బాలికా సంఘాలు ఉన్నాయని తెలిపారు. టీనేజ్ వయస్సులో ప్రతి ఒక్కరికీ కొన్ని సమస్యలు ఎదురవడం సహజమని, వాటిని ధైర్యంగా అధిగమిస్తూ జీవితంలో ముందుకు సాగాలని బాలికలకు సూచించారు.



కౌమార దశలో ఉన్న బాలికలు ఆరోగ్యకరమైన పోషకాహారం తీసుకోవడంతో పాటు మానసిక, భావోద్వేగ సమతుల్యతను కలిగి ఉండాలని తెలిపారు. తమకు ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

షీ టీమ్స్ విధులు, సేవల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, అవసరమైన సమయంలో వారి సహాయం తీసుకోవాలని పేర్కొన్నారు.

బాలికల భద్రత, అభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాల్లో సూచించిన అంశాలను శ్రద్ధగా గమనించి ఆచరించాలని పిలుపునిచ్చారు.

సైకాలజిస్ట్ డాక్టర్ బారుపాటి గోపి మాట్లాడుతూ, ప్రతి వ్యక్తిలో అపారమైన శక్తి, సామర్థ్యాలు దాగి ఉంటాయని, వాటిని గుర్తించి వెలికితీసినప్పుడే అద్భుతమైన విజయాలు సాధించగలమని వివరించారు.

వ్యక్తిగత ఎదుగుదలకు ఆటంకం కలిగించే మానసిక అడ్డంకులను మైండ్ బ్లాక్స్ గ పేర్కొన్నారు. కౌమార దశలో వినోదం, తక్షణ ఆనందం మాత్రమే ముఖ్యమని భావించే అవకాశం ఉంటుందని, అయితే జీవిత లక్ష్యాలను గుర్తించి వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు.

నేటి సమాజంలో సోషల్ మీడియా ప్రభావం విస్తృతంగా ఉందని, దాని పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సోషల్ మీడియా వినియోగంలో విచక్షణ పాటిస్తూ, దాని ప్రతికూల ప్రభావాలను అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని బాలికలకు సూచించారు.

ఈ కార్యక్రమం ద్వారా బాలికలకు మహిళా భద్రత, వ్యక్తిగత రక్షణ, మానసిక ఆరోగ్యం, భావోద్వేగ సమతుల్యత, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తమకు ఎదురయ్యే సమస్యలను భయపడకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైనప్పుడు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, అడిషనల్ డీసీపీలు బాలస్వామి, ఏసీపీలు సదయ్య, వెంకటరమణ, షీ టీమ్స్ ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ ఓ. రమేష్, షీ టీమ్స్ ఎస్ఐలు కిరణ్మయి, స్వాతి, రామారావు తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వరంగల్ జిల్లాలోని మండలాలకు చెందిన బాలికలు, మెప్మా సంఘాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**- కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి**





పాత పాల్వంచ మెప్మా సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న - విమలాదేవి మహిళలు అన్ని రంగాల్లో రాణించి, అభివృద్ధి చెందాలని పాత పాల్వంచ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు. పాత పాల్వంచ గడియకట్ట లో బుధవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ( మెప్మా ), కరుణశ్రీ పేద ప్రాంత సమాఖ్య ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ విమలాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలు చేపడుతున్నదని, మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విమలాదేవిని మహిళా సమాఖ్య సభ్యులు ఘనంగా సత్కరించారు .ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ బి. సరిత, ఆర్.పి. వై. అరుణ కుమారి, కరుణశ్రీ సమాఖ్య అధ్యక్షురాలు జి. ఆదిలక్ష్మి, కార్యదర్శి షేక్ షాహీన్, కోశాధికారి ఎస్. కనకరాణి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# హబ్సిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా చింతకింది ప్రవీణ్ నియామకం

**పార్టీ బలోపేతానికి కృషి చేస్తా ప్రజా సమస్యలపై పోరాడతా: చింతకింది ప్రవీణ్**



**ఉప్పల్ :** హబ్సిగూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా చింతకింది ప్రవీణ్ నియమితుల య్యారు. తనపై నమ్మకంతో కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చింతకింది ప్రవీణ్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ హబ్సిగూడ డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని, పార్టీ అధిష్ఠానం ఇచ్చే పిలుపు మేరకు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేస్తానని పేర్కొన్నారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తానని, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన వెల్లడించారు. పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగుతానని స్పష్టం చేశారు.తన నియామకానికి సహకరించిన మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, భేతి సుభాష్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు గిరి వర్ధన్ రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, మాజీ కౌన్సిలర్ తిండేరు హనుమంతరావు కు చింతకింది ప్రవీణ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# కొత్తగూడెం కార్మిక ప్రాంతమైన రుద్రంపూర్‌లో ఘనంగా స్వర్ణ దుర్గమ్మ దేవి నవరాత్రోత్సవా లు ఆటో డ్రైవర్స్ ఓనర్స్ ఆధ్వర్యంలో నిత్య అన్నదాన సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు

**కోనేరు సత్యనారాయణ, ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్.**

చుంచుపల్లి మండలం రుద్రంపూర్ ఆటో డ్రైవర్స్ మరియు ఓనర్స్ ఆధ్వర్యంలో కొలువుదీరిన



శ్రీ స్వర్ణ దుర్గమ్మ వారి మండపంలో దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. గత 27 సంవత్సరాలుగా ఈ ఉత్సవాలను ఆటో కార్మికులు, యజమానులు ఐక్యతతో, సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.?భక్తుల విశేష సహకారంతో గత సంవత్సరం నుంచి ప్రారంభించిన 'నిత్య అన్నదాన సంతర్పణ' కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నా రు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని), కొత్తగూడెం ఏరియా ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, రుద్రంపూర్ సర్పంచ్ కేస్లీ ముఖ్య అతిథులుగా హాజరై వీరి చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.?ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ---కాయకష్టం చేసుకునే ఆటో డ్రైవర్లు, ఓనర్లు సంఘటితమై 27 ఏళ్లుగా అమ్మవారి సేవలో నిమగ్నమవడం, సేవా దృక్పథంతో నిత్య అన్నదానం చేపట్టడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. తోటివారి ఆకలి తీర్చడమే నిజమైన దైవారాధన అని, ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విగ్రహదాత పెరుమాళ్ళ కుమార్, కమిటీ సభ్యులు బడే రమేష్, నాంపల్లి రమేష్, కన్ని ధనరాజు, పాపారావు, సంకేల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# ప్రకృతి పూల పండుగ.. బతుకమ్మ

**- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక: సైబరాబాద్ సీపీ డా.యం. రమేష్**






**సైబరాబాద్ :** ప్రకృతికి, తెలంగాణ సంస్కృతి సంప్రదాయా లకు బతుకమ్మ పండుగ నిలయమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా . యం. రమేష్ పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలు అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మకు తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో బుధవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో సీపీ రమేష్ పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలాడుతూ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని, మహిళల ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ తరతరాలుగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, క్రైమ్ డీసీపీ పుష్ప, కూకట్ పల్లి డీసీపీ రితిరాజ్, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిణి రెడ్డి, షీ టీమ్స్ డీసీపీ సృజన, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏవో జ్యోతిర్మయి మరియు పోలీసు అధికారులు, కమిషనరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సౌదీలో దాడులు వెంటనే ఆపాలి



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో సౌదీ అరేబియాలో పౌర మౌలిక సదుపాయాలు, విమానాశ్రయాలు, చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న దాడులను భారతదేశం ఖండించింది. ఈ దాడులు తక్షణమే నిలిపివేయాలని, ఎంత మాత్రం పౌర మౌలిక సదుపాయాలపై దాడులు ఆమోదయోగ్యం కాదని ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూూ) స్పష్టం చేసింది. సౌదీలోని భారత పౌరుల కోసం అక్కడి భారత రాయబార కార్యాలయం (ఎంబసీ) ప్రత్యేక అడ్వైజరీ జారీ చేసింది. పౌరులు భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, స్థానిక అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. ఇదే సమయంలో విదేశాల్లోని భారత పౌరుల సంక్షేమం, భద్రత తమ ప్రథమ ప్రాధాన్యం అని ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో జైస్వాల్- పలు కీలక అంశాలపై భారత వైఖరిని వెల్లడించారు.

సౌదీ అరేబియాలో జరుగుతున్న దాడుల పట్ల విచారం వ్యక్తం చేసిన భారత్- సౌదీ ప్రజలు, ప్రభుత్వానికి సంఘీభావం తెలుపుతోందని జైస్వాల్ పేర్కొన్నారు. ఆ దేశ సార్వభౌమత్వం, సమగ్రతను కాపాడుకునే ప్రయత్నాలకు భారత్ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో త్వరలోనే శాంతి చర్చలు జరిగి, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై అక్టోబర్ 10న జరిగిన దాడిలో మొత్తం ఒక భారతీయుడు సహా మొత్తం 13 మంది మరణించగా, మరో 10 మంది భారతీయులు గాయపడ్డారు. మృతుడి కుటుంబ సభ్యుల మేరకు సౌదీలోనే అంత్యక్రియలు నిర్వహించారు. యెమెన్‌లోని ఇరాన్ మద్దతు ఉన్న హూతీ తిరుగుబాటుదారులు కొద్ది రోజులుగా సౌదీపై వరుస దాడులకు పాల్పడుతున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. గాయపడిన భారతీయుల్లో పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

### భారతీయులకు ఎంబసీ కీలక మార్గదర్శకాలు

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా దాడులు జరుగుతున్నందున అక్కడి భారతీయులకు, భారత రాయబార కార్యాలయం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. భారతీయులు అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, స్థానిక అధికారుల సూచనల్ని కచ్చితంగా పాటించాలని పేర్కొంది. జరుగుతున్న పరిణామాలకు సంబంధించి వీడియోలు, వార్తల్ని ధ్రువీకరించకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయొద్దని స్పష్టం చేసింది. భారతీయులకు సహాయం చేసేందుకు ఎంబసీ 24 గంటల కంట్రోల్ రూంను ఏర్పాటు చేసింది. అత్యవసర పరిస్థితుల్లో o966- 536216082 (వాట్సాప్) నంబర్‌కు సందేశాలు పంపొచ్చు. ఇంకా 8002471234 నంబరు ద్వారా అధికారుల్ని సంప్రదించొచ్చు. మరోవైపు గల్ఫ్, హర్మూజ్ జలసంధి ప్రాంతాల్లో వాణిజ్య నౌకలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. ఈ క్రమంలో భారత జాతీయ భద్రతా సలహాదారు (చీూా) అజిత్ డోభాల్ అక్టోబర్ 12న ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహ్‌సేన్ రెజాయితో ఫోన్‌లో మాట్లాడినట్లు రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. సముద్ర మార్గాల్లో భారత నావికులు, చమురు ట్యాంకర్ల భద్రతపై ఇరువురు చర్చించినట్లు తెలిపారు. ఇటీవల వారం వ్యవధిలోనే భారతీయ సిబ్బంది ఉన్న 3 వాణిజ్య నౌకలపై వరుస దాడి ఘటనలు సముద్ర భద్రతపై ఆందోళనలు పెంచాయి.

### ఢిల్లీలో దీ×మీూజుజ హోం మంత్రుల భేటీ- బంగ్లాదేశ్ హాజరు

ఇక కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన న్యూఢిల్లీలో తొలి బిమ్‌స్టెక్ (దీ×మీూజుజ) హోం మంత్రుల భేటీ జరిగినట్లు జైస్వాల్ తెలిపారు. ఇందులో బంగ్లాదేశ్‌తో సహా అన్ని సభ్యదేశాలు పాల్గొన్నాయని వెల్లడించారు. ఇందులో ఉగ్రవాద నిర్మూలన, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై చర్యలు, మనీలాండరింగ్ నియంత్రణలో సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని పునరుద్ఘాటిస్తూ 'ఢిల్లీ డిక్లరేషన్'ను ఆమోదించారని ఎంఈఏ అధికార ప్రతినిధి వివరించారు. కొంతకాలంగా భారత్- బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, ఢిల్లీలో నిర్వహించిన ఈ సమావేశంలో బంగ్లాదేశ్ పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఢిల్లీ నిరసనలపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల విభాగం (ూఉజ=) చేసిన వ్యాఖ్యలను కూడా భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. ఇది భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని, ఆ వ్యాఖ్యలు అనుచితమని తోసిపుచ్చింది. ప్రపంచంలో ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న అణచివేతలపై స్పందించని ఓహెచ్‌సీహెచ్ఆర్ వైఖరి ఏకపక్షంగా ఉందని భారత్ వైఖరిని వెల్లడించారు జైస్వాల్.

## చైనాతో సంబంధాలు సాధారణ స్థితికి రావాలంటే

# వాస్తవాధీన రేఖ స్థిరంగా ఉండాలి




భారత్- చైనా మధ్య సంబంధాలు సాధారణ స్థితికి రావాలంటే 'వాస్తవాధీన రేఖ' వెంబడి పరిస్థితి స్థిరంగా ఉండాలని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. సరిహద్దుల్లో ఎటువంటి అశాంతి చెలరేగినా దానికి పర్యవసానాలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణ సరిహద్దు వద్ద శాంతితోనే ముడిపడి ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో జరిగిన 'బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్'లో ప్రసంగిస్తూ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

"చైనాకు మేము చెప్పే విషయం ఒకటే 'మీరు ఇరు దేశాల మధ్య సాధారణ సంబంధాలను కోరుకున్నా, మిగిలిన సంబంధాలు ముందుకు సాగాలన్నా సరిహద్దు స్థిరంగా ఉండాలి. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి అనేది చాలా స్పష్టమైన, సహజమైన విషయం'" అని ఆయన అన్నారు. 2024 నుంచి ూూజ వెంబడి పరిస్థితి చాలా వరకు అదుపులోకి వచ్చిందని, ఫలితంగా సంబంధాలు సాధారణ స్థితి వైపు పయనిస్తున్నాయని జైశంకర్ పేర్కొన్నారు. తూర్పు లద్దాఖ్‌లో నాలుగన్నర ఏళ్లకు పైగా కొనసాగిన సైనిక ప్రతిష్టంభన కారణంగా దెబ్బతిన్న సంబంధాలను సరిదిద్దడానికి గత కొన్ని నెలలుగా ఇరుపక్షాలు చర్యలు చేపట్టాయి. చివరకు ఇరు దేశాల మధ్య పలు దఫాల చర్చల అనంతరం ప్రతిష్టంభన 2024 చివరలో ముగిసింది. ఈ క్రమంలోనే సరిహద్దు సమస్యపై ఏదైనా 'ప్రారంభ దశ ఒప్పందం' కుదిరితే దేశంలో మరిన్ని చైనా పెట్టుబడులను భారత్ అనుమతిస్తుందా అన్న ప్రశ్నకు సమాధానంగా, వివిధ అవకాశాలను పరిశీలిస్తున్నామని జైశంకర్ స్థూలంగా చెప్పారు. "మేము ఇప్పుడు ఆ అవకాశాలను పరిశీలిస్తున్నాం. భవిష్యత్తులో పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలి. అయితే, వ్యాపారం చేయడానికి ముందు సరిహద్దు సమస్యను తప్పనిసరిగా పరిష్కరించుకోవాలని మేము పట్టుబట్టడం లేదు. మేము పెద్ద నిబంధనలు లేదా కఠినమైన షరతులు పెట్టడం లేదు. మా అంచనాలు చాలా తక్కువగా ఉన్నాయి. కేవలం శాంతి, ప్రశాంతతను పాటించడం మాత్రమే కావాలి. సరిహద్దు సమస్య పరిష్కారం తప్ప మరేదానితోనూ ఈ 'ప్రారంభ దశ ఒప్పందాన్ని' నేను ముడిపెట్టను. వ్యాపారం లేదా మార్కెట్ యాక్సెస్ అంశాలకు సంబంధించి మేము అనుసరించే విధానాలు వేరుగా పరిగణిస్తాం."

చైనాతో ఉన్న ఆర్థికపరమైన అంశాలపై కూడా విదేశాంగ మంత్రి జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. "చైనాతో మాకు చాలా కీలకమైన ఆర్థిక సమస్యలు కూడా ఉన్నాయి. నేడు వాణిజ్య సమతుల్యతను పరిశీలిస్తే, అది పూర్తిగా చైనా వైపే మొగ్గు చూపి ఉంటోంది. ఈ అసమతుల్యత తీవ్రంగా ఒకే వైపునకే ఉంది. ప్రపంచంలోని ఇతర దేశాలతో అనేక రంగాల్లో మేము విజయవంతంగా వాణిజ్యం సాగిస్తున్నా, చైనాలో మాత్రం మాకు మార్కెట్ ప్రవేశం లభించలేదు. అక్కడ ఆయా రంగాల్లో మా వ్యాపార కార్యకలాపాలు విజయవంతం కాలేదు. మేము వారికి సమానమైన వాణిజ్య అవకాశాలను కల్పించినట్లుగా, చైనాలో మాకు అటువంటి సమాన అవకాశాలు లభించడం లేదని మేము భావిస్తున్నాం." అని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే 2020 నాటి గల్వాన్ లోయ ఘర్షణల గురించి కూడా జైశంకర్ ప్రస్తావించారు. అవి ఇరు దేశాల సంబంధాలపై ఎంత తీవ్రమైన ఒత్తిడిని కలిగించాయో గుర్తు చేశారు. "1975 నుంచి 2020 వరకు అంటే దాదాపు 45 ఏళ్ల పాటు సరిహద్దులో ఎటువంటి రక్తపాతం జరగలేదు. చివరిసారిగా 1975లో ప్రాణనష్టం జరిగింది. ఆ తర్వాత కాలంలో భారత్- చైనా సంబంధాలు మెరుగుపడ్డాయి. అనంతరం 2020లో మేము కొవిడ్ లాక్‌డౌన్ పరిస్థితుల్లో ఉన్నప్పుడు సరిహద్దులో వరుస సమస్యలు తలెత్తాయి. చివరకు అవి ఘర్షణకు దారితీసి ఇరువైపులా పలువురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మా దృష్టిలో ఇది 1975 నుంచి కొనసాగుతున్న పరిస్థితులకు పూర్తిగా భిన్నమైన పరిణామం. సరిహద్దు ప్రాంతాల్లో శాంతికి భంగం కలిగితే అది సంబంధాలపై ప్రభావం చూపుతుంది," అని జైశంకర్? అన్నారు. శాంతిని పునరుద్ధరించే వరకు తర్వాతి కొన్నేళ్లలో ఆ పరిణామాలు స్పష్టంగా కనిపించాయని జైశంకర్ పేర్కొన్నారు.

# 'జంతర్‌మంతర్ భారత ప్రజలది'

ఢిల్లీలోని జంతర్?మంతర్ వద్ద నిరసన తెలిపిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలను జ్యుడీషియల్ కస్టడీకి పంపడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. జాతీయ జెండాను ప్రదర్శించినందుకు యువతను జైలుకు పంపడమేంటని ప్రశ్నించాయి. నిరసన తెలిపే హక్కును హరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విపక్ష నేతలు విమర్శించారు. జంతర్‌మంతర్ దేశ ప్రజలదని, దాన్ని తిరిగి సాధించుకుంటామని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారిని జైల్లో పెడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించడం నేరం కాదని రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఇలా చేసినందుకు యువతను జైలుకు పంపడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, ఇండియా కూటమి వేర్వేరు వేదికలపై ఉన్నప్పటికీ అందరి లక్ష్యం ఒక్కటే. రాజ్యాంగం కల్పించిన హక్కులను కోరుతూ పౌరులు చేస్తున్న ఆందోళనలన్నీ ఒకే పోరాటంలో భాగం. జంతర్‌మంతర్ భారత ప్రజలకు చెందినది. దాన్ని తిరిగి సాధించుకుంటాం. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాపాడుకోవాల్సిన అవసరం ఉంది' అని రాహుల్ గాంధీ తెలిపారు.

### ముందు ఓటు తర్వాత నిరసన హక్కు చోరీ : ఖర్గే

"ఎస్ఐఆర్ ప్రక్రియకు వెలుపల ఉన్న 13.3 కోట్ల మందిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా 'చొరబాటుదారులుగా అభివర్ణించడం వారి జాతీయతను అవమానించడమే. సుప్రీంకోర్టు నిర్ణయం ఉన్నప్పటికీ జంతర్‌మంతర్‌ను నిరసనలకు అనుమతించిన ప్రదేశాల జాబితా నుంచి తొలగించడం అంటే మొదట ఓటు చోరీ ఇప్పుడు నిరసన తెలిపే హక్కు చోరీనే అవుతుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు రక్షణ కల్పించడం ఆపాలి. యువ నిరసనకారులను జైలుకు పంపడం, ఆందోళనకారులపై పోలీసులు బలప్రయోగం చేయడం, మహిళల పట్ల దురుసుగా వ్యవహరించారు. ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా ఉన్నట్లు తాను పేర్కొన్న కొన్ని వర్గాలకు అధికారులు స్వేచ్ఛనిస్తున్నారు. మోదీ-షా ప్రభుత్వ విధానాలకు ప్రజలు తలవంచబోరని, బీజేపీని ప్రతి అంశంపై నిలదీస్తారు. దేశ ప్రజలు తమ గొంతు వినిపిస్తూనే ఉంటారు"

### 'మన దేశంలో మన జెండా ఎగరేయడం నేరమా?'

ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా సీజేపీ కార్యకర్తలపై చర్యలను తప్పుబట్టారు. సొంత దేశంలో జాతీయ జెండాను ప్రదర్శిం చడం నేరమా అని ప్రశ్నించారు. పోలీసుల చర్య పూర్తిగా హాస్యాస్పదంగా ఉందని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే కూడా సీజేపీ కార్యకర్తల అరెస్టును ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. జంతర్ మంతర్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించిన యువతను జైలుకు పంపడమేంటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని తిరిగి సాధించుకునే వరకు ప్రభుత్వానికి, దేశభక్తులైన యువతకు మధ్య పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

### అరెస్టయిన యువతకు అండగా డీఎంకే

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ సైతం ఈ ఘటనపై స్పందించారు. ఎంతమంది నిరసనకారులను ప్రభుత్వం నిర్బంధించగలదని, ఎంతమంది యువత గొంతులను అణచివేయగలదని ప్రశ్నించారు. యువతను జైలుకు పంపే కొద్దీ రాజకీయాలతో సంబంధం లేని సాధారణ పౌరులు సైతం వీధుల్లోకి వచ్చి తమ నిరసనను వ్యక్తం చేస్తారని అన్నారు. సౌరవ్ దాస్, ఆశుతోష్‌కు అవసరమైన న్యాయ సహాయం అందించేందుకు డీఎంకే సిద్ధంగా ఉందని తెలిపారు. నిరసనకారులపై చర్యలు ప్రజల్లో మరింత వ్యతిరేకతను పెంచుతాయని హెచ్చరించారు.

ఇదిలా ఉండగా, ఆందోళనల సమయంలో పలువురు నిరసనకారులను పోలీసులు కొట్టారని మీడియా సమావేశంలో రాహుల్ ఆరోపించారు. ప్రజల ముక్తకంఠాన్ని అణచివేయాలని చూస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కేంద్ర ప్రభుత్వాన్నిహెచ్చరించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వీరికి కులం, మతం, లింగ భేదాలు లేవని చెప్పారు. ముక్త కంఠంతో పోరాడుతున్న వారిపై దాడులు సహించబోమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, అమిత్ షా ఈ ప్రజా గళానికి వ్యతిరేకంగా నిలబడుతున్నారని, ఆ ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని సూచించారు. దౌర్జన్యాలకు పాల్పడుతున్న పోలీసుల వీడియోలు తీసి, ఆ ఆధారాలను తమకు పంపాలని విద్యార్థులకు సూచించినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారం ముగిసిన తర్వాత ఆ సాక్ష్యాధారాలతో విద్యార్థులపై చేయి చేసుకున్న వారికి శిక్ష పడేలా చేస్తామన్నారు.

### పోలీస్ స్టేషన్‌లోనూ కొట్టారని ఆరోపణ

తనపై ఓ మహిళా కానిస్టేబుల్ దాడి చేశారని ఎన్ఎస్‌యూఐ మహిళా కార్యకర్త తెలిపారు. నిరసనలో పాల్గొన్న కార్యకర్తలను పోలీసులు మూడు బస్సుల్లో ఎక్కించి అదుపులోకి తీసుకున్నారని చెప్పారు.

## ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన..



తమ పార్టీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 16న ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో త్రివర్ణ పతాక ప్రదర్శన నిర్వహించనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. దేశభక్తులంతా జాతీయ జెండాలతో సెంట్రల్ పార్క్‌కు రావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో విడుదల చేసిన వీడియో సందేశంలో ఈ నిరసనకు 'లెహ్రావో దో తిరంగా' అని పేరు పెట్టినట్లు దీప్కే తెలిపారు. కేవలం త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకే సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను జైలుకు పంపారని ఆయన ఆరోపించారు. అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌కు జాతీయ జెండాలతో చేరుకోవాలని కోరారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం నేరం కాదని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెబుతామని అన్నారు. ఢిల్లీకి రాలేని వారు తమ ప్రాంతాల్లో తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే విజ్ఞప్తి చేశారు. జాతీయ జెండా తమ గర్వకారణమని, దాన్ని ప్రదర్శించడం నేరం కాదనే సందేశాన్ని అందించాలని కోరారు. ఈ నిరసన తర్వాత తనను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని, అయినా ఆందోళన చెందడం లేదని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తానని స్పష్టం చేశారు.

### ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ

మరోవైపు, జంతర్ మంతర్‌లోకి అక్రమంగా ప్రవేశించిన కేసులో సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలకు బుధవారం ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. సీజేపీకి చెందిన మరో నేత అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. దాస్‌ను తీహార్ జైలులోని రెండో నంబర్ జైలులో, రంకాను నాలుగో నంబర్ జైలులో వేర్వేరుగా ఉంచినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. ముగ్గురు సీజేపీ సభ్యులను జంతర్ మంతర్‌లోకి చొరబడినందుకు ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు. జంతర్ మంతర్‌ను నిరసనలకు కేటాయించిన అధికారిక ప్రదేశాల జాబితా నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

## దేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోంది



భారతదేశ సంగీతం, నృత్యం, సినిమాలు, వంటకాలు దేశాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమాజాలతో అనుసంధానిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వీటి వల్ల దేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోందని కొనియాడారు. చారిత్రక కట్టడాలను పరిరక్షించడంతో పాటు 'జ్ఞాన్ భారతం' కార్యక్రమం ద్వారా భారత పురాతన తాళపత్రాల వారసత్వాన్ని కూడా ప్రభుత్వం పరిరక్షిస్తోందని ఆయన తెలిపారు. అక్టోబర్ 14 నుంచి 16 వరకు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న 'బృహత్తర భారత్: ప్రపంచవ్యాప్తంగా భారతదేశ సాంస్కృతిక సంబంధాలపై అంతర్జాతీయ సదస్సు'ను ఉద్దేశించి పంపిన సందేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్ ప్రధాన మంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా పాల్గొన్నారు. విదేశాల నుంచి పురాతన కళాఖండాలను తిరిగి భారత్?కు తీసుకువచ్చే ప్రయత్నాలు కొత్త ఊపును అందుకున్నాయని తెలిపారు. అదే సమయంలో భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పెరుగుతోందని మోదీ చెప్పారు. భారతదేశ సాంస్కృతిక వారసత్వం, సరిహద్దులకు అతీతంగా విస్తరించిన దాని నాగరికతా వారసత్వం అనే ఇతివృత్తంతో జరుగుతోంది. ఈ సదస్సును కేంద్ర సాంస్కృతిక శాఖ పరిధిలోని 'ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్' (×+చీజూూ) నిర్వహిస్తోంది. ప్రపంచంతో భారతదేశానికి ఉన్న చారిత్రక, సమకాలీన సాంస్కృతిక సంబంధాలపై చర్చించేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. దీనికి వివిధ దేశాల ప్రతినిధులు, రాయబారులు, పండితులు హాజరవుతున్నారు. అలాగే, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆధ్యాత్మిక మార్గదర్శకత్వంలో అప్పటి కలకత్తాలో 1926 అక్టోబర్ 14న భారతీయ పండితుల బృందం స్థాపించిన 'గ్రేటర్ ఇండియా సొసైటీ' (బృహత్తర భారత్ పరిషత్) శతజయంతి ఉత్సవాలకు కూడా ఇది వేదికైందని ×+చీజూూ పేర్కొంది.

## షార్జాలో భారతీయుడికి జాక్‌పాట్.. లాటరీలో రూ. 13 కోట్లు!



యూఏఈలోని షార్జాలో నివసిస్తున్న కిషోర్ అనే ప్రవాస భారతీయుడిని అదృష్టం వరించింది. ఆయన ఏకంగా 5 మిలియన్ దిర్హమ్‌ల (సుమారు రూ. 13 కోట్లు) లాటరీ గెలుచుకున్నారు. యూఏఈ లాటరీలో రెండో బహుమతిని ఆయన సొంతం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. అక్టోబర్ 3న యూఏఈ లాటరీ నిర్వాహకులు డ్రా తీశారు. ఈ డ్రాలో కిషోర్ కొనుగోలు చేసిన టికెట్‌కు రెండో బహుమతి దక్కింది. ఆయన అధికారిక వెబ్‌సైట్ ద్వారా 50 దిర్హమ్‌లు (సుమారు రూ. 1300) వెచ్చించి ఈ టికెట్‌ను కొనుగోలు చేశారు. లాటరీ ఫలితాలు వెలువడిన తర్వాత, విజేతల జాబితాలో తన పేరు చూసి మొదట నమ్మలేకపోయానని కిషోర్ తెలిపారు. ఆ తర్వాత తన వద్ద ఉన్న టికెట్ నంబర్‌తో సరిచూసుకుని, విజేతను తానేనని నిర్ధారించుకున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ లాటరీ డ్రాలో 30 మిలియన్ దిర్హమ్‌ల (సుమారు రూ. 78 కోట్లు) భారీ జాక్‌పాట్‌ను ఎవరూ గెలుచుకోలేదని నిర్వాహకులు తెలిపారు. కిషోర్ లాటరీ గెలిచిన విషయాన్ని యూఏఈ లాటరీ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. ఒక్క లాటరీ టికెట్‌తో రాత్రికి రాత్రే కోటీశ్వరుడైన కిషోర్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# ఉద్యోగులుగానే మిగలొద్దు..
# సొంత సంస్థలు స్థాపించాలి




**హైదరాబాద్:** ఎలాన్ మస్క్‌తో హైదరాబాద్ కంపెనీ స్కైరూట్ పోటీ పడుతోందని, మన ఆర్థిక వ్యవస్థ బలపడాలంటే స్కైరూట్ ఏరోస్పేస్ వంటి కంపెనీలు 10 రావాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సరికొత్త వ్యాపార ఆలోచనలతో స్టార్టప్స్‌ను స్థాపించాలని, తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని యువతకు, పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. ప్రపంచ స్థాయి దిగ్గజ సంస్థలకు కేవలం సేవలు అందించే ఉద్యోగులుగానే కాకుండా, వాటిని సృష్టించే యజమానులుగా యువత ఎదగాలని ఆకాంక్షించారు. హైటెక్స్‌లో బుధవారం ప్రారంభమైన సమాఖ్య బిజినెస్ సమ్మిట్--2026 ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లా డారు. భారతీయ మూలాలున్న ఎందరో ప్రతిభావంతులు ప్రపంచ ప్రసిద్ధ సంస్థలకు నాయకత్వం వహిస్తున్నారని, అయితే వారు వాటిని స్థాపించలేదని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల, ఎడోబ్ సీఈఓ శంతను నారాయణ్, ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా వంటి ప్రముఖులు ప్రపంచ వ్యాప్తంగా సేవలందిస్తున్నారని, కానీ వారు ఆయా సంస్థల స్థాపకులు కాదని పేర్కొన్నారు. మన యువత కేవలం సేవా రంగాలకే పరిమితం కాకుండా, కొత్త ఆవిష్కరణలతో సొంత సంస్థల స్థాపన వైపు అడుగులు వేయాలని సూచించారు.

**మహిళలకు సర్కారు ప్రోత్సాహం**

'రాష్ట్ర అభివృద్ధి కోసం మా ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగుతోంది. 2034 నాటికి తెలంగాణను ఒక లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, అలాగే 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా ప్రభుత్వ ప్రధాన ఆశయం. దేశ స్థూల జాతీయోత్పత్తిలో ప్రస్తుతం తెలంగాణ వాటా ఐదు శాతంగా ఉంది., దానిని 10 శాతానికి పెంచడమే మా లక్ష్యం. ఏ దేశంలోనైనా ఆర్థిక ప్రగతి సాధించాలంటే మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకం. అభివృద్ధి చెందిన దేశాలలో మహిళా కార్మిక శక్తి 50 శాతం కంటే ఎక్కువగా ఉంది. మన దేశంలో ఆ సంఖ్య తక్కువగా ఉన్నందున మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. మహిళల నేతృత్వంలో అభివృద్ధిని ప్రోత్సహించడానికి రాష్ట్రంలో ఉన్న సుమారు 67 లక్షల మంది సభ్యులతో కూడిన మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.61 వేల కోట్ల బ్యాంక్ అనుసంధాన నిధులను ప్రభుత్వం కల్పించింది. ఈ సంఘాల మహిళలు సొంతంగా బస్సులను కొనుగోలు చేసి, వాటిని ప్రభుత్వ రవాణా సంస్థకు అద్దెకు ఇచ్చేలా నూతన అవకాశాలను కల్పించాం. మహిళల నేతృత్వంలోని కంపెనీలు 1,000 మెగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి..'అని సీఎం చెప్పారు.

**గత ప్రభుత్వ మంచి పథకాలేవీ రద్దు చేయలేదు..**

'రాష్ట్రంలో 1994 నుంచి 2004 వరకు ఉన్న ప్రభుత్వ విధానాలనే, తదుపరి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మంచి పథకాలను, విధానాలను మా ప్రభుత్వం రద్దు చేయలేదు. పెట్టుబడిదారులకు అనుకూల విధానాల ద్వారా వారి పెట్టుబడులకు పూర్తి రక్షణ, సహకారం అందిస్తాం. 'తెలంగాణ రైజింగ్ 2047' స్వప్నాన్ని సాకారం చేయడానికి అందరూ భాగస్వాములు కావాలి..'అని రేవంత్ పిలుపునిచ్చారు. డిసెంబర్ 7--9 మధ్య జరిగే తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్‌లో పాల్గొనాలని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి రైజింగ్ తెలంగాణ లక్ష్య సాధనలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, హన్మంతరావు, ఎంపీ కె.లక్ష్మణ్, విప్ ఆది శ్రీనివాస్, మాజీ న్యాయమూర్తి జస్టిస్ భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఏడో బ్లాక్ తొలగించాల్సిందే!



**హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ మరమ్మతులు, పునరుద్ధరణ అంత సులభంగా పూర్తయ్యేలా కనిపించడం లేదు. కుంగిపోయిన మేడిగడ్డ బరాజ్ ఏడో నంబర్ బ్లాక్‌ను పునాదులతో సహా పూర్తిగా తొలగించి పునర్నిర్మించక తప్పదని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సభ్యులు(టెక్నికల్) అధ్యక్షతన ఏర్పాటైన సాంకేతిక పర్యవేక్షణ కమిటీ సూచించినట్టు తెలిసింది. ఏడో బ్లాక్‌లోని కొన్ని పియర్ల(పిల్లర్లు)కు తీవ్ర పగుళ్లు ఏర్పడటంతో పాటు, రాఫ్ట్ (పునాది) భాగం నదీ గర్భంలోకి కుంగిపోవడంతో.. ఏడో బ్లాక్‌ను పూర్తిగా తొలగించి పునర్నిర్మించాలా? లేక బ్లాక్‌ను నాన్ ఓవర్ ఫ్లో (ఎన్ఓఎఫ్) డ్యామ్‌గా మార్చాలా? అనే రెండు ప్రత్యామ్నాయాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలన జరుపుతోంది.

ఎన్ఓఎఫ్ డ్యామ్‌గా మార్చాలని నిర్ణయిస్తే ఏడో బ్లాక్ గేట్లను తొలగించి పూర్తిగా కాంక్రీట్ గోడగా పటిష్టం చేస్తారు. కాగా ఏడో బ్లాక్‌ను బలోపేతం చేసి మరమ్మతులు చేయడంపై పరిశీలన జరిగినప్పటికీ, ఇప్పుడు దెబ్బతిన్న భాగాలను పూర్తిగా తొలగించి మొదటి నుంచి పునర్నిర్మించకతప్పదని సాంకేతిక పర్యవేక్షణ కమిటీ సూచించినట్టు సమాచారం. ఈ విధానంలో దెబ్బతిన్న నిర్మాణ భాగాలను కత్తిరించి తొలగించడం, అనంతరం పునాదుల స్థాయి నుంచి తిరిగి నిర్మించడం వంటి క్లిష్టమైన పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఏడో బ్లాక్‌కు ఇరువైపులా ఉన్న ఇతర బ్లాకులకు నష్టం జరగకుండా పనులు చేసే అంశంపై నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ--పీఈఎస్ జేవీతో విస్తృతంగా చర్చించాలని నీటిపారుదల శాఖకు కమిటీ సూచించినట్లు సమాచారం.

కాళేశ్వరం బరాజ్‌ల పునరుద్ధరణ చర్యలను పర్యవేక్షించడానికి కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన ఈ కమిటీ బుధవారం న్యూఢిల్లీలో ఎన్డీఎస్ఏ సమావేశ మందిరంలో భేటీ అయ్యింది. కాళేశ్వరం బరాజ్‌ల పునరుద్ధరణ చర్యలపై విస్తృతంగా చర్చించింది. పునరుద్ధరణ పనులకు సంబంధించి డిజైన్ కన్సల్టెన్సీ 'ఆఫ్రీ ఇండియా'రూపొందించిన ప్రాథమిక డిజైన్లు, డ్రాయింగ్స్‌ను పరిశీలించి పలు మార్పులను సూచించింది. మూడు వారాల్లోగా సమగ్ర డిజైన్లు, డ్రాయింగ్స్‌ను రూపొందించి తదుపరి సమావేశానికి తీసుకురావాలని నీటిపారుదల శాఖను కోరింది.

**ఎన్ఓఎఫ్ డ్యామ్ తట్టుకుంటుందా?**

మేడిగడ్డ బరాజ్‌ను 2019లో డిజైన్ చేసినప్పుడు అందుబాటులో ఉన్న వరద లెక్కలతో పోల్చితే ఆ తర్వాత గణనీయమైన మార్పులొచ్చాయని, బరాజ్‌కు వరుసగా నాలుగు రోజులు, ఆపై కాలానికి భారీ వరదలు పోటెత్తితే ఎన్ఓఎఫ్ డ్యామ్ తట్టుకుని నిలబడకపోవచ్చని కమిటీ అనుమానం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్(సీడబ్ల్యూపీఆర్ఎస్), వాతావరణ శాఖ సహకారంతో వరదల సరళిపై అధ్యయనం జరపిన తర్వాతే మేడిగడ్డ బరాజ్‌లోని ఏడో బ్లాక్‌పై తుది నిర్ణయం తీసుకోవాలని సూచించింది. మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు అదనపు భద్రత కోసం వాటికి ఎగువన, దిగువన డయాఫ్రమ్ వాల్స్ నిర్మాణంతో పాటు దిగువన ఉన్న స్టిల్లింగ్ బేసిన్ల విస్తరణ, కొత్త కటాఫ్ వాల్స్ నిర్మాణం, పునాదుల కింద నీటి ప్రవాహం నివారణకు సంబంధించి నీటిపారుదల శాఖ సమర్పించిన ప్రాథమిక డిజైన్లను కమిటీ పరిశీలించి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్టు సమాచారం.

**స్టిల్లింగ్ బేసిన్‌ను పొడిగించాలి**

మేడిగడ్డ బరాజ్ నుంచి కిందికి విడుదల చేసే వరదతో దిగువన ఉన్న భాగాలకు నష్టం కలగకుండా నీటి వేగాన్ని తగ్గించడానికి కొత్త స్టిల్లింగ్ బేసిన్ల నిర్మాణం, పునాదుల కింద నుంచి నీటి ప్రవాహాన్ని నివారించడానికి కటాఫ్ వాల్స్ ఏర్పాటు చేసే అంశంపై కమిటీ పలు కీలక సూచనలు చేసింది. బరాజ్‌లోని మొత్తం 85 పియర్లను కవర్ చేసే వరకు కొత్త స్టిల్లింగ్ బేసిన్‌ను పొడిగించాలని కోరింది. రాష్ట్ర నీటిపారుదల శాఖ తరపున సలహాదారులు కల్నల్ పరీక్షిత్ మెహ్రాతో పాటు రామగుండం సీఈ టి.శ్రీనివాస రావు గుప్తా, జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# ఇక టోల్ వలుచుడే..

**ఎన్‌హెచ్ 563పై నేటి నుంచి టోల్ వసూలు**

**కరీంనగర్ రిజిస్ట్రేషన్ వాహనాలకు సాధారణ చార్జీలు**

**ఇతర జిల్లా వాహనాలకు ఆటో, కార్లకు రూ.160, భారీ వాహనాలకు రూ.1,020**

**త్వరలో ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం**

**కరీంనగర్:** ఉత్తర తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి దోహదం చేసే జాతీయ రహదారి ఎన్‌హెచ్ 563పై టోలు వసూలుకు రంగం సిద్ధమైంది. అక్టోబర్ 15 నుంచి రహదారిపై ప్రయాణించే అన్ని వాహనాల నుంచి టోలు వసూలుకు భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అన్ని ఏర్పాట్లు చేసింది. ఎన్‌హెచ్ 563ని రెండు సెక్షన్లుగా విభజించారు. 68 కి.మీ. మేర కరీంనగర్--వరంగల్ సెక్షన్ కాగా జగిత్యాల-- కరీంనగర్ సెక్షన్ 59 కి.మీ.లతో నిర్మించ తలపెట్టారు. ఇందులో 68 కి.మీ. మేర ఉన్న కరీంనగర్--వరంగల్ సెక్షన్ పనులు ఇటీవల పూర్తయ్యాయి. సెప్టెంబర్ 5వ తేదీ నుంచి ఈ రహదారి మీద నుంచి రాకపోకలు ట్రయల్స్ బేసిస్ మీద నడిపిస్తున్నారు. కేవలం 40 నిమిషాల్లోనే కరీంనగర్ నుంచి వరంగల్ చేరుకునేలా అత్యాధునిక సదుపాయాలతో గరిష్ట వేగం 100 కి.మీ. వెళ్లేలా నాలుగు వరసలతో విశాలంగా నిర్మించారు. అదే సమయంలో జగిత్యాల--కరీంనగర్ సెక్షన్ పనులను దాదాపు రూ.2,000 కోట్లకుపైగా బడ్జెట్‌తో ఇటీవల టెండర్లు పిలిచారు.



**కొత్తగట్టు వద్ద టోల్ వసూలుకు బూత్ ఏర్పాటు**

జాతీయ రహదారి 563పై ప్రయాణించే వాహనాలకు కొత్తగట్టు వద్ద ఏర్పాటు చేసిన టోల్ బూత్ నుంచి టోల్ వసూలు చేయనున్నారు. ఈ క్రమంలోనే భారత జాతీయ రహదారుల సంస్థ ఏ వాహనానికి ఎంత రుసుం వసూలు చేస్తారన్న దానిపై పట్టిక విడుదల చేసింది. ఇందులో కరీంనగర్ జిల్లాలో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలకు సాధారణ చార్జీలనే వసూలు చేస్తుండగా.. అదే ఇతర జిల్లాల్లో రిజిస్టరైన వాహనాలకు మాత్రం రెండింతలు టోల్ ధరలు నిర్ణయించారు. ఇది తమపై భారం మోపుతుందని వాహనదారులు వాపోతున్నారు. ' కారు లేదా వ్యాన్ తదితర లైట్ వెయిట్ వాహనాలకు కరీంనగర్ జిల్లాలో రిజిస్ట్రేషన్ అయి ఉంటే సింగిల్ జర్నీకి రూ.80గా ధర నిర్ణయిస్తే.. ఇతర జిల్లా వాహనాలకు రూ.160 గా ఖరారు చేశారు. ఇది వాహనం రకాన్ని బట్టి మారుతుంటుంది. ఏడు లేదా అంత కంటే ఎక్కువ యాక్సెల్ కలిగిన వాహనాలకు సింగిల్ జర్నీకి రూ.1,020గా నిర్ణయించారు. టోల్‌గేట్‌కు 20 కి.మీ. లోపల నివసిస్తున్న వారికి మంత్లీ రూ.360తో పాస్ జారీ చేస్తారు. డిసెంబర్‌లో ఈ రహదారిని ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేయనున్నారు.

## రాష్ట్రంలో పెట్టుబడులు సురక్షితం



-మొదటిపేజీ తరువాయి

ప్రాధాన్యమిస్తామని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్డీలో బ్రిటన్‌లోని యార్క్‌షైర్ ప్రాంతానికి చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో సీఎం సమావేశమ య్యారు. దక్షిణ యార్క్‌షైర్ మేయర్ ఒలివర్ కాప్‌కార్డ్, వెస్ట్ యార్క్‌షైర్ మేయర్ ట్రేసీ బ్రాబిన్, యార్క్ అండ్ నార్త్ యార్క్‌షైర్ మేయర్ డేవిడ్ స్కైత్ ఈ బృందానికి నేతృత్వం వహించారు. భారత్--బ్రిటన్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో తెలంగాణ, యూకే ప్రాంతాల మధ్య వాణి జ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, విద్య, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడంపై చర్చించారు. దేశంలోనే అతి పిన్న వయసున్న రాష్ట్రంగా తెలంగాణ ఐటీ, ఔషధాలు, జీవశాస్త్రాలు, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, రక్షణ, ఎల క్ట్రానిక్స్ తయారీ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధిస్తోందని సీఎం వివరించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026కు బ్రిటన్ పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించారు.

**నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక విశ్వవిద్యాలయం**

కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో యువతకు అవసరమైన నైపుణ్యాలను అందించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సీఎం ఈ సందర్భంగా తెలిపారు. పరిశ్రమల భాగస్వామ్యంతో నేరుగా నైపుణ్య శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. తెలంగాణ దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళిక 'తెలంగాణ రైజింగ్--2047' రూపకల్పన లో బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ కీలకమైన విజ్ఞాన భాగస్వామిగా వ్యవహరించారని చెప్పారు. 30 వేల ఎకరాల్లో ప్రపంచస్థాయి ఉపగ్రహ నగరంగా అభివృద్ధి చేయ నున్న భారత్ ఫ్యూచర్ సిటీ మాస్టర్‌ప్లాన్‌ను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. మూఖీసీ నదిని పునరుజ్జీవింపజేసి, నదీతీర ఆర్థిక కార్యకలాపాలు, రాత్రివేళ ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా యూకే--ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన 'యూకే--ఇండియా సీఈటీఏ అండ్ రీజినల్ సినర్జీస్' నివేదికను సీఎం ఆవిష్కరించారు.

**తెలంగాణతో భాగస్వామ్యంపై ఆసక్తి**

అధునాతన తయారీ, వైద్యం, డిజిటల్ సాంకేతికత, రక్షణ, ఏరోస్పేస్, సాంకేతిక వస్త్రాలు, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేయడానికి యూకే ప్రతినిధులు ఆసక్తి చూపారు. వివిధ రంగాల్లో 1.50 లక్షల వ్యాపార సంస్థలు కలిగిన యార్క్‌షైర్‌కు, తెలంగాణకు అనేక ఉమ్మడి ప్రయోజనాలున్నాయని దక్షిణ యార్క్‌షైర్ మేయర్ ఒలివర్ కాప్‌కార్డ్ చెప్పారు. తెలంగాణ, యార్క్‌షైర్ మధ్య అనేక సారూప్యతలు, ఉమ్మడి ప్రయో జనాలున్నాయని, తాము సోదరసోదరీమణుల్లాంటి వార మని వెస్ట్ యార్క్‌షైర్ మేయర్ ట్రేసీ బ్రాబిన్ వ్యాఖ్యా నించారు. ఈ సమావేశంలో యూకే--ఇండియా బిజినెస్ కౌన్సిల్ సీఈవో కిశోర్ జయ రామన్, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్ ప్రతినిధులు, సీఎస్ సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ప్రపంచస్థాయి వర్సిటీలకు కేంద్రంగా తెలంగాణ: శ్రీధర్‌బాబు**

ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలకు తెలంగాణ నిలయంగా మారే దిశగా ముందుకు సాగుతోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు చెప్పారు. ఇటీవల సీఎం నేతృత్వంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం బ్రిటన్ పర్యటనలో ప్రముఖ విశ్వవిద్యాలయాలు, వ్యాపార సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకుందని తెలిపారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, అక్కడి ఆవిష్కరణల వ్యవస్థను పరిశీలించాలని యూకే ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించారు.

# కోవిడ్ లాంటి విపత్తు

-మొదటిపేజీ తరువాయి

ఏర్పాట్లు చేసినా యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని ఆరా తీశారు. 'ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సింది నేను. రైతుల పంటలను కాపాడేందుకు అవసరమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితి మారలేదు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను సహించేది లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదు' అని ముఖ్యమంత్రి తీవ్రంగా హెచ్చరించారు. అవసరమైతే ఇంధన శాఖ స్పెషల్ సీఎస్ (నవీన్ మిట్టల్), జెన్‌కో సీఎండీ (ఎస్.హరీష్)తోపాటు విద్యుత్ సంస్థల సీఎండీలుగా వ్యవహరిస్తున్న ఐఏఎస్‌లను సస్పెండ్ చేస్తానన్నారు. విద్యుత్ అంతరాయాలకు రోజుకో కారణం చెప్పవద్దని హెచ్చరించారు.

**కోవిడ్ లాంటి విపత్తు**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కోవిడ్ తరహా విపత్తుగా పరిగణించి అన్ని ప్రభుత్వ శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. 'ఈ పరిస్థితి ఎప్పటివరకు ఉంటుందో ఎవరికీ తెలియదు. ఇప్పుడు సమస్యగా కనిపిస్తోంది. అప్రమత్తం కాకపోతే సంక్షోభంగా మారుతుంది. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో ఎల్‌నినో ప్రభావాన్ని లోతుగా అంచనా వేయాలి. పరిష్కార మార్గాలను గుర్తించి చర్యలు చేపట్టాలి' అని స్పష్టం చేశారు. వచ్చే జూన్ వరకు ప్రతి శాఖ పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. రాబోయే సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**గ్రామసభలు, కళాజాతలతో ప్రజల్లో అవగాహన..**

ఎల్‌నినో ఒక విపత్తని, దీని ప్రభావం, రాబోయే సంక్షోభ పరిస్థితులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సీఎం రేవంత్ సూచించారు. దసరా తర్వాత దీపావళి వరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కళాజాతల ద్వారా ప్రజలకు ఎల్‌నినో ప్రభావాన్ని వివరించాలని.. నీరు, విద్యుత్ పొదుపుతోపాటు రాబోయే పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో పరిస్థితులపై రేవంత్ గురువారం సాయంత్రం సచివాలయంలో మంత్రులతో సమావేశమై చర్చించనున్నారు.

**తాగునీరు, పశుగ్రాసానికి ఇబ్బందులు రావద్దు..**

ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సరఫరా సజావుగా సాగేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మాణ రంగంతోపాటు ఇతర అవసరాలకు మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో (ఎస్టీపీలు) శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో పశువులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రతి మండలానికి గ్రూప్--1, 2 స్థాయి అధికారులను నియమించాలని ఆదేశించారు. సంబంధిత మండలాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కి నివేదించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.



# దశావతారాల కథ 'హైందవ'

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న మిస్టికల్ డివోషనల్ థ్రిల్లర్ 'హైందవ' నవంబర్ 27న విడుదలకానుంది. మహేష్ చందు నిర్మాత. సంయుక్త మీనన్ కథానాయిక. బుధవారం టీజర్‌ను ఆవిష్కరించారు. రంగాపురం అనే గ్రామంలోని పురాతన ఆలయంలో విగ్రహాలన్నీ మాయం అవుతాయి. అదే సమయంలో గ్రామంలో ఓ వ్యక్తి హత్యకు గురవుతాడు. ఈ కేసుని పరిశోధించడానికి దేవుడిపై నమ్మకం లేని ఓ పోలీస్ అధికారిని నియమిస్తారు. ఈ నేపథ్యంలో చోటుచేసుకునే ఆసక్తికరమైన సంఘటనలతో టీజర్ ఆద్యంతం ఆసక్తిని పెంచింది. అద్భుతమైన కథ, విజువల్స్‌తో కూడిన మిస్టికల్ థ్రిల్లర్ ఇదని, ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ని అందిస్తుందని హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తెలిపారు. దశావతార గుడి నేపథ్యంలో జరిగే కథ ఇదని దర్శకుడు పేర్కొన్నారు.





# కథలు నచ్చక.. కాస్త విరామం!

తొమ్మిది నెలలుగా తాను ఒక్క చిత్రాన్ని కూడా అంగీకరించలేదని అగ్ర కథానాయిక మృణాల్ ఠాకూర్ స్పష్టం చేసింది. అల్లు అర్జున్ 'రాకా' చిత్రంలో ఈ భామ కీలక పాత్రను పోషిస్తుందనే వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో మృణాల్ ఠాకూర్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. 'గత తొమ్మిది నెలలుగా ఏ సినిమాకూ సంతకం చేయలేదు. ఆఫర్లు బాగానే వస్తున్నాయి. కానీ కథలు నా మనసుకు నచ్చడం లేదు. అందుకే సినిమాలకు విరామం తీసుకున్నా. ఒక సినిమా కోసం మూడునాలుగు నెలల సమయాన్ని వెచ్చించాల్సి వస్తున్నది. అంత సమయాన్ని కేటాయిస్తున్నామంటే కథలో ఏదో ఒక ప్రత్యేకత ఉండాలి కదా' అని మృణాల్ ఠాకూర్ చెప్పుకొచ్చింది. 'రాకా' సినిమాలో మృణాల్ ఠాకూర్ నటిస్తున్నదని, ఆమె షూటింగ్‌లో కూడా పాల్గొంటున్నదని ముంబై సినీ వర్గాల్లో కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకూ చిత్రబృందం ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

# 'కల్కి 2' సెట్స్‌లోకి రెబల్ స్టార్ ప్రభాస్.. త్వరలో ప్రారంభం కానున్న భారీ షెడ్యూల్!

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ సీక్వెల్ చిత్రం 'కల్కి 2898 ఏడీ -- పార్ట్ 2' షూటింగ్‌కు సంబంధించి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ సైన్స్ ఫిక్షన్ పౌరాణిక చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటి భాగం ఘనవిజయం సాధించడంతో, దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ సీక్వెల్‌ను మరింత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన తదుపరి షెడ్యూల్ మరియు షూటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. అయితే ప్రభాస్ రేపటినుంచి ఈ సినిమా షూటింగ్ సెట్స్‌లో అడుగుపెట్టబోతున్నట్లు తెలుస్తుంది. ప్రభాస్ తన కీలక సన్నివేశాల షూటింగ్‌లో పాల్గొనబోతున్నాడు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి దిగ్గజ నటులు నటిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను 2027 నాటికి పూర్తి చేసి, భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రభాస్ కొత్త షెడ్యూల్ అప్‌డేట్‌తో ఆయన అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS. published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512